మానేరు **జనత** ®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

23.3.2026 సోమవారం Monday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 332 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar


## ఐపీఎల్ మధ్యలో చార్టర్డ్ ఫ్లైయిటా?

**ఇన్‌స్టా పోస్టుపై కోహ్లీ రియాక్షన్**





సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ప్రోత్సాహకులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్




# ప్రత్యామ్నాయ పంటల మార్పు అవశ్యం

## మారుతున్న పరిణామాలతో పంటల సాధించిన అభివృద్ధే ఆదర్శంగా తీసుకోండి

### ప్రతి గ్రామం ఓ అంకాపూర్ కావాలి

ఇక్కడ విధానాన్ని రూపొందిస్తాం త్వరలో ఆవిష్కరిస్తాం

చేయూతనిచ్చే బాధ్యత వంద శాతం ప్రభుత్వానిదే

రైతుల కోసం ప్రతి నెలా రూ.5,500 కోట్లు ఖర్చు చేస్తున్నాం

**పామాయిల్ పంటకు ఉజ్వల భవిష్యత్తు**

పది లక్షల ఎకరాల్లో పండించినా కొనుగోలు చేస్తాం

**కొడంగల్లోనూ పామాయిల్ ఫ్యాక్టరీ పెట్టండి**

సిద్దిపేట జిల్లా నర్మెట్ట బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి



**జనతా న్యూస్, సిద్దిపేట :** తరతరాలుగా వ్యవసాయ రంగాన్నే నమ్ముకున్న రైతులు ఆర్థికంగా, సామాజికంగా పురోగమించాలంటే, అందుకు ప్రత్యామ్నాయం పంటల మార్పిడేనని రాష్ట్రముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో అన్ని రకాలుగా స్వయం సమృద్ధి సాధించిన నిజామాబాద్ జిల్లాలోని ఓ గ్రామాన్ని మనం ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేస్తూ.. ప్రతి గ్రామం ఓ అంకాపూర్ తరహాలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అక్కడ సాధించిన అభివృద్ధే ఆద ర్శంగా ముందడుగు వేస్తే, చేయూతనిచ్చే బాధ్యత 100 శాతం ప్రభుత్వానిదేనని భరోసా ఇచ్చారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నర్మెట్టలో సీఎం పర్యటించారు. ఈ సందర్భంగా నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ముఖ్యమంత్రి జాతికి అంకితం ఇచ్చారు. అనంతరం అక్కడే రూ.80 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన వంటనూనె రిఫైనరీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రైతు ఉత్సవాల పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో

## 2029లో మళ్లీ గెలుస్తాం

సిద్దిపేటలో ఈసారి కాంగ్రెస్ గెలవాలి

అడ్డం పడుతుంటే ఆగుతామా?

ఇప్పుడు వచ్చినట్టే మళ్లీ వస్తాం..

నిధుల విడుదలలో నాకు వివక్ష లేదు

ఏ పంటకు ఏ తెగులు పడితే ఏ మందు వేయాలో నాకు బాగా తెలుసు

సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



## రైతు భరోసా నిధులు విడుదల

రైతుల ఖాతాల్లో నేడు జమ

తొలివిడతగా రూ.3,590 కోట్లకు బటన్ నొక్కిన సీఎం రేవంత్ రెడ్డి

## గ్యాస్, పెట్రోల్, డీజిల్‌కు నో ప్రాబ్లమ్

### దేశంలో ఇంధన కొరత లేదు

అధిక సామర్థ్యంతో పని చేస్తున్న రిఫైనరీలు.. నిలకడగా సరఫరా

దేశంలో ఇంధన పరిస్థితిపై ప్రధాని మోడీ సమీక్ష

ఎలాంటి ఇబ్బంది లేదని ప్రభుత్వ ప్రకటన



దేశంలో ఇంధన కొరత ఏమాత్రం లేదు. పెట్రోల్, డీజిల్ సరఫరా స్థిరంగా ఉంది. ఎల్పీజీ సరఫరా కూడా స్థిరంగా ఉంది. ఏ రకమైన కొరత లేదు. అన్ని రిఫైనరీలు అధిక సామర్థ్యంతో పనిచేస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఆదివారమిక్కడ ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షత తన కేంద్ర మంత్రులతో కూడిన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది.

04

## ప్రధాని మోడీ సరికొత్త చరిత్ర

8,931 రోజులపాటు ప్రభుత్వాధినేతగా కొనసాగింపు

రాజకీయ ప్రస్థానంలో 25వ ఏడాదిలోకి అడుగు

వరుసగా మూడు సార్లు ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి కాంగ్రెసేతర నేత

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అభినందనలు

## రాష్ట్రంలో రాబందుల రాజ్యం

రైతుల సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం

### రైతు గణపతిది ప్రభుత్వ హత్యే

బీఆర్ఎస్ నేతలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




03

రాష్ట్రంలో రైతు బంధు పాలనపోయి రాబందుల పాల న వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు తు డుం గణపతి ఆత్మహత్య సంఘ టనను ఆయన తీవ్రంగా పరిగ ణించిన ఆయన రైతులు పోరాడి సాధించుకోవాలే కానీ ఆత్మహత్యలకు పాల్పడవద్దని కోరారు.



## కాంగ్రెస్‌తో నాలుగు దశాబ్దాల అనుబంధం తెగిపోయింది

### ఇక నావల్ల కాదు

20 నెలల మానసిక క్షోభ వల్లే బయటకు రావల్సి వచ్చింది

03

ఫిరాయింపుదారులే పార్టీని నడిపిస్తున్నారు

మాజీ మంత్రి జీవన్ రెడ్డి వ్యాఖ్యలు

## 48 గంటల్లోగా జలసంధిని తెరవాలి

### లేదంటే మీ పవర్ ప్లాంట్లు పేల్చేస్తాం

**ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక**

హార్ముజ్ జలసంధిలో అణుజలాంతర్గామి

యూఎస్ మద్దతుగా యూకే మోహరింపు

ఇరాన్‌పై ఐక్యపోరాటం చేద్దాం

ప్రపంచ దేశాలకు ఇజ్రాయెల్ పిలుపు

**మీకు నిలువ నీడ లేకుండా చేస్తాం**

**చుక్క నీరూ పుట్టనివ్వం**

చమురు దొరక్కుండా కేంద్రాలు ధ్వంసం చేస్తాం

**మీ స్థావరాల నామరూపాలుండవ్**

జలసంధిలోకి శత్రునౌకలకు మాత్రమే నో ఎంట్రీ

ఎఫ్-15 ఫైటర్ జెట్ కూల్చేశాం.. ఇరాన్ సైన్యం ప్రకటన



4

హార్ముజ్ పూర్తిగా మూసేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఈ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవాలని లేనిపక్షంలో ఇరాన్ గ్యాస్, చమురు క్షేత్రాలపై బాంబులేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన హెచ్చరికలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఎలాంటి షరతుల్లేకుండా జలసం ధిని పూర్తిగా తెరవాలని ఇందుకోసం తాను 48గంటలు గడువిస్తున్నట్లు శనివారం రాత్రి ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్టులో హెచ్చరికలు జారీ చేశారు.

# 2029లో మళ్లీ గెలుస్తాం

**సిద్దిపేటలో ఈసారి కాంగ్రెస్ గెలవాలి**

**అడ్డం పడుతుంటే ఆగుతామా? ఇప్పుడు వచ్చినట్టే మళ్లీ వస్తాం..**

**నిధుల విడుదలలో నాకు వివక్ష లేదు**

**ఏ పంటకు ఏ తెగులు పడితే ఏ మందు వేయాలో నాకు బాగా తెలుసు**

**సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**



సిద్దిపేట : సిద్దిపేటలో హరీష్ రావును ఓడిస్తే, ఆనాయకుడికి మంత్రిపదవి పక్కాగా ఇస్తామని కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ రెడ్డి బంపరాఫర్ ప్రకటించారు. సిద్దిపేటలోనూ ప్రజలు మార్పు కోరుకోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. ఇక్కడి నుంచి గెలిచినోడికి మంత్రి పదవితో పాటు భారీగా అభివృద్ధి నిధులిచ్చి ప్రోత్సహిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ మేమే గెలుస్తామని, మరిన్ని మెరుగైన విధానాలను అనుసరించి ప్రభుత్వంగా, రాజకీయంగా లక్ష్యాలను చేరుకుంటామని భరోసా ఇచ్చారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నర్మెటలో నిర్వహించిన రైతు ఉత్సవాల సభలో మాట్లాడిన రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్, హరీశ్ రావు టార్గెట్గా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అడ్డం పడుకుంటే ఆగుతామా..? అని ప్రశ్నించారు. రాజకీయంగానే కాదు.. "అన్ని రకాలుగా తొక్కుకుంటూ ఈ స్థాయికి వచ్చామని, ఇకపై అదిరే, బెదిరే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు. ఎవరెన్ని ఎత్తుగడలు వేసినా, 'మళ్లీ వస్తాం.. సమావేశం పెడతాం.. ఇక్కడ గెలిచినోడికి కీలక భాగస్వా మ్యం కల్పిస్తాం' అంటూ ముక్యమంత్రి ఉద్ఘాటించారు. గడిచిన రెండేళ్ల పాలనలో కీలక రంగాల్లో ప్రక్షాళన మొదలుపెట్టి ఆర్థిక సుస్థిరత దిశగా బలమైన అడుగులు వేశామని సీఎం రేవంత్ తెలిపారు. భవిష్యత్తులోనూ అన్ని రంగాల్లో అభివృద్ధికి బలమైన పునాధులు వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మాకు ప్రాంతీయ వ్యతిరేకత లేనేలేదని, అలాంటి భావన కల్పించే నేతలను ప్రజాక్షేత్రం నుంచి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. అన్ని నియోజకవర్గాలను సమానంగా చూస్తామని, ప్రస్తుతం ఆ విధానంతోనే మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామని పేర్కొన్నారు. ఏ పంటకు ఏ తెగులు తగులుతుందో ప్రత్యక్షంగా తెలుసుకున్న వాడినని, ఏ రకం చీడపురుగులకు ఏ మందు వేయాలో కూడా తనకు బాగా తెలుసునన్న విషయం ప్రతిపక్ష పార్టీల నేతలు గుర్తుపెట్టుకోవాలని పరోక్షంగా హెచ్చరిం చారు. విద్వేషాలకు, ప్రాతీయ వాదాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. రాజకీయంగా నాయకుల తో తలపడి కొట్టాడుతా.. కానీ కుట్రలు, కుతంత్రాలతో అభివృద్ధిని అడ్డుకునే లక్షణాలు మాకు లేవని తాజాగా హరీష్రవు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ.. సీఎం రేవంత్ ధీటుగా సమాధానమిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, పేద కుటుంబాలకు అన్నగా అన్ని వర్గాల ప్రజలను కడుపులో పెట్టుకుని చూసుకుంటామని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. యుద్ధ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ఈ పరిస్థితుల్లో వ్యవసాయ రంగంలోనూ ముందు జాగ్రత్త అవశ్యమని పేర్కొన్నారు. వరి లాంటి అధిక ఎరువులు అవసరమయ్యే పంటలకు క్రమక్రమంగా స్వస్తి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమీప భవిష్యత్తులోనే ఎరువుల కొరత తలెత్తే అవకాశం ఉన్నందున రామగుండం కర్మాగారం నుంచి ఉత్పత్తయ్యే యూరియా పూర్తిగా తెలంగాణాకే ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడి రైతలు అవసరాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం వద్దకు ప్రతినిధి బృందాన్ని పంపిస్తామని తెలిపారు. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నకేంద్ర మంత్రులు కిషన్రెడ్డి, బండి సంజయ్, ఎంపీ రఘునందన్ రావు సహా అందరూ కలిసి రావాలని, అభివృద్ధి విషయంలో, సంక్షోభ సమయాల్లో రాజకీయాలకు అతీతంగా సహకరించాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. 2029లోనూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి రాబోతోందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో సిద్ధిపేటలో కాంగ్రెస్ గెలవాలని సిద్దిపేటలో గెలిచి ఎమ్మెల్యేను మంత్రిని చేస్తామని హామీ ఇచ్చారు. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ కాంగ్రెస్ పోటీ పడింది. కానీ ప్రజలు బీఆర్ఎస్కు అధికారం ఇచ్చారు. 2023 లో మాకు అధికారం ఇచ్చారు. 2029 మళ్లీ మాకే అధికారం ఇవ్వబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. మార్పుతో మరింత అభివృద్ధి**

సిద్దిపేటను 1984 నుంచి 2029 ఒకే కుటుంబం పాలిస్తోందని ఒక్కసారి ఇతరులకు కూడా అవకాశం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మార్పు చేసి చూస్తే మంచి జరుగుతుందో మీరే చూడాలన్నారు. మల్లన్నసాగర్, ఏటిగడ్డకిష్టాపూర్ వంటి సమస్యలు వచ్చిననాడు మేము నిలబడ్డామని ఈ ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ వ్యవహరించినట్లు మేము వ్యవహరించడం లేదన్నారు. నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టు నిర్వాసితులను ఒప్పించాకే పనులు ప్రారంభించామ న్నారు. మూసీలో మీ మొసలి కన్నీరు ప్రజలు అర్థం చేసుకోవడం లేదనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. రాజకీయాల కోసం, ప్రజల మేలు కోసం మాట్లాడాలి. కానీ ఏమి జరగవద్దు వీళ్లను ఏమీ చేయనివ్వొద్దు అంటే అది ప్రజల పట్ల పగతో వ్యవహరించినట్లేనన్నారు. ప్రతిపక్షం బాధ్యత ఇది కాదన్నారు. అభివృద్ధి జరగకుండా అడ్డం పడుకుంటామంటే ఊరుకుంటామా? ముఖ్యమంత్రినై సిద్దిపేటకు రాలేదా? 2029లో మళ్లీ గెలిచి సిద్ధిపేటకు వస్తామన్నారు.

**కేసీఆర్, కేటీఆర్, హరీష్రావుతో మాత్రమే భిన్నాభిప్రాయాలు..**

ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల తర్వాత అభివృద్ధిపైనే నా దృష్టి అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుతో రాజకీయంగా తనకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కానీ వారి నియోజకవర్గాల్లో కూడా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ మా నిజాయితీ నిరూపించుకున్నామన్నారు. నర్మెట్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు నేను ముఖ్యమంత్రి అయ్యాకే ప్రారంభమయ్యాయి. కావాలనుకుంటేనేను ఈ ఫ్యాక్టరీని కొడంగల్కు తీసుకువెళ్లకపోయేవాడినా? కానీ ఇక్కడి రైతుల కోసం ఇక్కడే నిర్మించాం. ఆ తర్వాతే తన నియోజకవర్గానికి ఒకటి ఇవ్వమని మంత్రులను కోరుతున్నానని చెప్పారు. నేను వివక్ష చూపడంలేదన్నారు. వివక్ష గురించి మాట్లాడితే 2014 నుంచి 2023 వరకు కొడంగల్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు ఇచ్చారు? మేమొచ్చాక ఈ ప్రాంతానికి నేను ఎన్ని నిధులు ఇచ్చామో లెక్కలు తీద్దామన్నారు. పేదల కోసం పని చేస్తాం తప్ప రాజకీయ నాయకుల కోసం మేము పని చేయామన్నారు. నాకు వ్యవసాయం తెలుసని, ఏ చెట్టుకు, ఏ పంటకు ఏ తెగులు తగులుతుందో ప్రత్యక్షంగా తెలుసుకున్న వాడినని పేర్కొన్నారు. ఏ చీడపురుగులకు ఏ మందు వేయాలో కూడా తనకు బాగా తెలుసునని సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో విపక్షాలకు చురకలంటించారు.

# నేటి నుంచి బడ్జెట్ పై చర్చ

**హైదరాబాద్ :** ప్రజా ప్రభుత్వం విప్లవాత్మకంగా ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్పై ఉభయ సభల్లో చర్చ జరగనుంది. ఈ నెల 20న ప్రవేశ పెట్టిన బడ్జెట్పై రెండు రోజుల విరామం అనంతరం సోమవారం చర్చకు వీలుగా ఉభయ సభలు సమావేశం కానున్నాయి. సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు బడ్జెట్పై చర్చ జరిపి విపక్షాలు, ప్రభుత్వం బడ్జెట్పై తమతమ అభిప్రాయా లను తెలపనున్నాయి. అనంతరం విపక్షాల అభ్యంతరాలు, సలహాలు, సూచనలపై ప్రభుత్వం సమాధానం ఇవ్వనుంది. ఆ తర్వాత వరుసగా పద్దులపై చర్చించనున్నా రు. వీలైతే పలు బిల్లులు, లఘు చర్చలకు ప్రభుత్వం సభను వినియోగించుకోనుంది. ప్రధానంగా మూసీ పునరుజ్జీవం, తెలంగాణ విజన్ 2047, హిల్ట్ పాలసీలపై లఘు చర్చలు జరగనున్నట్లు తెలిసింది. విపక్షాలు కోరినట్లుగా వీటిపై చర్చకు అనుమ తించి ప్రభుత్వం తమ ప్రాధాన్యతలు, వాస్తవాలను సభ వేదికగా వెల్లడించనుంది.

# ప్రత్యామ్నాయ పంటల మార్పు అవశ్యం

మొదటి పేజీ తరువాయి

ఆయన మాట్లాడుతూ.. మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలో ఉన్నా, వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందని, ఆ ఒరవడిని కొనసాగిస్తూ.. రైతుల కోసం ప్రతినెలా ప్రజా ప్రభుత్వం రూ.5,500 ఖర్చు చేస్తోందని తెలిపారు. మారుతున్న పరిణామాలతో పంటల మార్పు అవశ్యమైందని, వ్యవసాయం, రైతులు బాగుపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆ దిశగా ప్రత్యామ్నాయ పంటల విధానాన్ని రూపొందిస్తామని, త్వరలోనే ఆవిష్కరిస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. సిద్ధిపేటలో నిర్మించిన ఫ్యాక్టరీని కొడంగల్లోనూ నిర్మించాల్సిన అవసరం ఉందని, వెనకబడిన ప్రాంతం అయినందున తమకూ వెసులుబాటు ఉంటుందని అన్నారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా లాంటి వెనకబడిన ప్రాంతాలపై ఒకన్నేయాలని వ్యవసాయ మంత్రితుమ్మల నాగేశ్వరావు, జిల్లా ఇంచార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహలకు వేదికపైనుంచే విజ్ఞప్తి చేశారు. పామాయిల్ పంటను సాగుచేసే రైతులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని అన్నారు. ప్రస్తుతం 3 లక్షల ఎకరాల్లో సాగవుతున్నట్లు అధికారులు తెలిపారని, 10 లక్షల ఎకరాల్లో పండించినా కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. 45 రోజుల్లో రూ.9వేల కోట్ల నిధులను 78 లక్షల రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. రైతు సంక్షేమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం వెనకడుగు వేయబోదని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టమైన భరోసా ఇచ్చారు. ఆర్థిక సమస్యలు ఇబ్బంది పెడుతున్నా రైతుల విషయంలో వెనుకంజ వేయడం లేదని అన్నారు.

**సాంప్రదాయానికి భిన్నంగా పంట మార్పిడి అవసరం**

రాష్ట్రంలోని పంటల విధానంలో మరిన్ని మార్పులు రావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రాంతం నిజాం కాలంలోనే వాణిజ్య పంటలకు ప్రసిద్ధిగా ఉండేది. గతంలో రంగారెడ్డి జిల్లాలో కూరగాయలు, పండ్లు ఆకుకూరలు బాగా పండించేవారు. కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల రంగారెడ్డి జిల్లా పంటల సాగు తగ్గింది. దాంతో కూరగాయలు, పండ్లు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. రాష్ట్రంలో పంటల మార్పిడి జరగాల్సిన అవసరం ఉందని ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేయాల న్నారు. అయిల్ పామ్ పరిశ్రమ లాభసాటిదన్నారు. ఎన్ని లక్షల ఎకరాల్లో పామాయిల్ పండించినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. మన పంటలను ఎగుమతి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది. అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల యూరియా కొరత ఏర్పడే -సమస్య ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో తయారవుతున్న యూరియా మొత్తం మనకే ఇవ్వాలి. యుద్ధం కారణంగా తెలంగాణలో యూరియా కొరత రాకుండా ఉండేందుకు కాంగ్రెస్, బీజేపీ ఎంపీలతో కూడిన ప్రతినిధుల బృందాన్ని కేంద్రం వద్దకు తీసుకువెళ్లాలని దీన్ని మంత్రి తుమ్మల -- సమన్వయం చేయాలన్నారు.

**తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభిస్తాం.**

విద్యాకమిషన్ ఇచ్చిన ప్రతిపాదన మేరకు రాబోయే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ నుంచి విద్యను అందించేలా రాష్ట్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభించబోతు న్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ స్కూళ్ల కంటే మెరుగ్గా చేయిస్తామని అందువల్ల ప్రైవేట్ స్కూల్ మోజులో పడి ఆర్థికంగా ఇబ్బందులు పడవద్దన్నారు. 18 వేలకు పైగా ఉన్న



స్కూళ్లను ప్రక్షాళన చేసే బాధ్యత నాదేననిచెప్పారు. సాంకేతిక నైపుణ్యం వైపు మనం వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

**ఆయిల్ పాం ఫ్యాక్టరీ సహా రూ.775 కోట్ల పనులకు శ్రీకారం**

ప్రజా పాలనలో రైతు ఉత్సవాలు కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో పర్యటించి అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అక్కడ రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆయిల్ పామ్ కర్మాగారా న్ని ప్రారంభించి రాష్ట్ర రైతులకు అంకితం చేశారు. దీనితో పాటు రిఫైనరీ యూనిట్ నిర్మాణానికి కూడా ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా నిధులను విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.775.72 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ఆయన మంత్రులతో కలిసి శ్రీకారం చుట్టారు. సిద్దిపేట నియోజక వర్గ పరిధిలో విద్యా, వైద్య, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ పలు భవనాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారం భించారు. ఇందులో రూ.141.34 కోట్లతో సిద్ధిపేట మున్సిపాలిటీ లో నీటి సరఫరా, డ్రైనేజీ ప్రాజెక్టులు, రూ. 78 కోట్లతో ఎన్సా న్పల్లిలో జిల్లా జైలు భవనం, రూ.15కోట్లతో 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రి ముఖ్యమైనవి ఉన్నాయి, వీటితో పాటు సెంట్రల్ మెడిసిన్ స్టోర్, నంగునూరు, అంబేద్కర్ నగర్లలో కొత్త పిహెచ్సి(ఐఈ) భవనాలను జాతికి అంకితం చేశారు.

# రైతు భరోసా నిధులు విడుదల



**రైతుల ఖాతాల్లో నేడు జమ**

**తొలివిడతగా రూ.3,590 కోట్లకు బటన్ నొక్కిన సీఎం రేవంత్ రెడ్డి**

సిద్దిపేట : తెలంగాణ రాష్ట్ర రైతాంగం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న యాసంగి రైతు భరోసా నిధులు విడుదల య్యాయి. ఆదివారం సిద్దిపేట జిల్లా నర్మెటలో నిర్వహించిన రైతు ఉత్సవాల సభలో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతుల కోసం రూ.9వేల కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ 9వేల కోట్లు మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయబోతోంది. తొలి విడతగా ఆదివారం సాయంత్రం ఎకరం వరకు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో రూ.3,590 కోట్లకు సీఎం బటన్ నొక్కా రు. అయితే ఆదివారం కావడంతో సోమవారం రోజు ఈ నిధులు రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. ఈ తొలి విడత నిధులు ఆర్బీఐ ద్వారా బ్యాంకులకు, బ్యాంకుల నుంచి నేరుగా రైతన్నల అకౌంట్లలో జమ అవుతాయి. ఇక మరో 20 రోజుల తర్వాత రెండో విడతలో భాగంగా రూ.2,650 కోట్లను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయ నుంది. ఇకఏప్రిల్ చివరినాటికి చివరి విడత నిధులను కూడా ప్రభుత్వం రిలీజ్ చేయనుంది. మూడో విడతలో భాగంగా రూ.2,760 కోట్లు విడుదల కానున్నాయి.

కాగా పెట్టుబడి సాయం కింద తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ప్రతి యేటా రెండు విడతల్లో ఎకరాకు రూ.6వేల చొప్పున ఏడాదికి రూ.12 వేలు రైతులకు ఆర్థిక సాయం అందజేస్తోంది. మొత్తంగా రాష్ట్రంలోని సుమారు కోటి యాభై లక్షల ఎకరాల వ్యవసాయ భూములకు ఈ పెట్టుబడి సాయం అందనుంది.

# ఆర్య వైశ్యులకు ఎల్లవేళలా సముచిత స్థానం

**వాసవి మాత జయంతి, వర్ధంతి ఇక అధికారికం**

**ఆరు మున్సిపల్ చైర్మన్ పదవులతో పాటు ఒక మేయర్ పదవిచ్చి**

**రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాం**

**దేశ నిర్మాణంలో ఆర్యవైశ్యుల భాగస్వామ్యం అజరామరం**

**తెలంగాణ పునర్నిర్మాణంలోనూ క్రియాశీల భూమిక**

**కాంగ్రెస్ ఎప్పుడు అధికారంలో ఉన్నా సముచిత ప్రాధాన్యం**

**పాతతరం నాయకుడైనా డా. కొణిజేటి రోశయ్య నేటితరం రాజకీయాలకు మార్గదర్శి**

**శ్రీ వాసవి మహాశక్తి మహోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్ :** దేశ నిర్మాణంలో, అభివృద్ధిలో సామాజిక చైతన్యం లో ఆర్యవైశ్యుల భాగస్వామ్యం అజరామరమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ పునర్ నిర్మాణంలోనూ వారు క్రియాశీల భూమిక పోషించారని స్పష్టం చేశారు. ఆదివారం తెలంగాణ ఆర్య వైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన "శ్రీ వాసవి మహాశక్తి మహోత్సవం" కార్యక్రమంలో సీఎం రేవంత్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలో ఉన్నా.. ఆర్యవైశ్యులకు రాజకీయంగానే కాదు.. ప్రభుత్వంలో కూడా సముచిత ప్రాధాన్యత దక్కుతూ వస్తున్నదని అన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలోనూ తెలంగాణ ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్న ఆశయం తో ఆర్య వైశ్యులను భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్య వైశ్యులకు 6 మున్సిపల్ చైర్మన్ పదవులతో పాటు ఒక మేయర్ పదవి ఇచ్చి రాజకీయంగా ప్రాధాన్యత కల్పించామన్నారు. అవకాశాలు వచ్చినా, రాకున్నా క్రమశిక్షణ ఉల్లంఘించ కుండా ఆర్య వైశ్యులు ఓపికతో ఉంటారని సీఎం రేవంత్ ప్రశంసించారు. నాకు ఇష్టమైన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య అని పేర్కొన్నారు. రాజకీయ కురువృద్ధుడిగా, కాంగ్రెస్ పార్టీలో భీష్ముడిగా పేరున్న ఆయనతో వాదించడం, ప్రశ్నించడం గౌరవంగా ఉండేదని గతాన్ని గుర్తు చేసుకున్నారు. రోశయ్య విగ్రహం లక్షీకాపూల్లో ఆవిష్కరించి ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తున్నామని చెప్పారు. నేటి పోటీ రాజకీయాల్లో కూడా చతురతను చాటుకుంటూ టీజీ వెంకటేష్ లాంటి నేతలు అనేక మంది ఆంధ్రా, రాయలసీమ ప్రాంతాల్లో ఇతరులకు దీటుగా ఎదిరించి గెలిచి నిలబడ్డారని గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ ఆర్య వైశ్యులకు సముచితమైన స్థానం కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. మెరుగైన, చురుకైన మీ ఆలోచనలు ప్రభుత్వ విధానాలకు ఎంతగానో దోహదపడుతాయని ఆర్య వైశ్యులనేఉ ఉద్దేశించి ముఖ్యమంత్రి అన్నారు. మీ గౌరవానికి భంగం కలగకుండాచూస్తాం, గిన్నీస్ బుక్ రికార్డ్ సాధించినందుకు అభినందనలు. ఆర్య వైశ్యులు ఊరికి ఒక్కరు ఉన్నా ఆధిపత్యం చూపిస్తుంటారు. పాత తరాల్లో రాజరికంలో అధికారం మారాలంటే హింస తప్పనిసరిగా ఉండేది. కానీ మహాత్మా గాంధీ ఒక్కరే అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారు. రవి హస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అహింస, సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహంతో పారదోలిన గొప్ప తత్వవేత్త జాతిపిత మహాత్మాగాంధీ" అని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గతాన్ని గుర్తు చేశారు. "శ్రీ వాసవి మహాశక్తి మహోత్సవం" కార్యక్రమంలో ఏపీ మంత్రి టీజీ భరత్, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, ఆర్య వైశ్య సంఘాల ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజల జీవనస్థితి గతులను మెరుగుపరిచే పీపుల్స్ బడ్జెట్

### డిప్యూటీ డిప్యూటీ సీఎం సీఎం మల్లు మల్లు భట్టి విక్రమార్క

### నేటి నుండి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు

### రాష్ట్రంలో 1.15 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ జీవిత బీమా పథకం అమలు



**ఖమ్మం :** రాష్ట్ర ప్రజల జీవనస్థితి గతులను మెరుగుపరిచే పీపుల్స్ బడ్జెట్ను ప్రవేశపెట్టామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం ఇక్కడి జిల్లాకాం గ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డిభవన్లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా బడ్జెట్ను రూపొం దించినట్లు చెప్పారు. కులం, మతం, ప్రాంతం భేదం లేకుండా రాష్ట్రం లో అందరికీ ఇందిరమ్మ జీవిత బీమా పథకం వర్తింప చేస్తామని, రాష్ట్రంలో 1.15 లక్షల కుటుంబాలకు జీవిత బీమా అంది స్తామని తెలిపారు. మన పిల్లలే రేపటి సంపద, వారి భవిష్యత్తు రాష్ట్ర భవిష్య త్తుగా భావించి వారంలో ఆరు రోజులు పౌష్టికాహారం అందిస్తు న్నామన్నారు. యుక్త వయసులో సరైన నిర్ణయాలు తీసుకునేందుకు ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. వారం వారం ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లిస్తామని, ఈ సంవత్సరం కూడా నియోజకవర్గానికి 1000 ఇందిరమ్మ ఇళ్లు చొప్పున మంజూరు చేస్తున్నామనీ తెలిపారు. పనిలేని వారికి పని కల్పించేందుకు ఉపాధి హామీ పథకాన్ని పెద్ద ఎత్తున ముందుకు తీసుకువెళ్లనున్నట్లు తెలిపా రు. ఉద్యోగుల కుటుంబాలకు నగదు రహిత వైద్య చికిత్స కార్డులు. ప్రభుత్వ ఉద్యోగికి ప్రమాదం జరిగితే రూ.1.02 కోట్ల ప్రమాద బీమా అమలు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో అర్హులైన రైతులకు రూ.3446.94 కోట్లు రైతు భరోసా నిధులు విడుదల చేశామని, రేపటి నుంచి రైతుఖాతాల్లో ఆ నిధులు జమవుతాయని వెల్లడించారు. మూ డు విడతల్లో పూర్తి స్థాయిలో ఈ నిధులు అందజేస్తామని వివరించా చామనీ, ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను రు. మన బిడ్డలకు నైపుణ్యం నేర్పేందుకు స్కిల్ యూనివర్సిటీని స్థాపిం నెలకొల్పుతున్నామనీ, అందులో చదువుకునే విద్యార్థులకు రూ. 2000లు వంతున స్కాలర్షిప్ అందిస్తామని వెల్లడించారు. ఈ సంవ త్సరం కొత్తగా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో 14 వేల బెడ్స్ అందు బాటు లోకి వస్తాయని తెలిపారు. సన్నధాన్యం సాగుచేసిన రైతులకు బోనస్ రూపంలో రెండు సీజన్లలో ఒక్కో ఎకరాకు రూ.25 వేలు జమయ్యా యని తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కోసం రూ .14 వేలకోట్లు రైతుల పక్షాన ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లిస్తుందనీ వివరించారు. బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజం అభి వృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ క్రీడలను ప్రోత్స హించేందుకు సీఎం కప్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. విలేకరుల సమా వేశంలో డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, మాజీ డీసీసీ అధ్యక్షుడు పు వ్వాళ్ళదుర్గాప్రసాద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహ్మద్ జావిద్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మొక్క శేఖర్ గౌడ్, గజ్జెల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

#### విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం

విద్యకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు. విద్య కోసం పెట్టే ప్రతి రూపాయి భవిష్యత్ తరాలను నిర్మించేందుకు పెట్టే పెట్టుబడిగా ఆయన అభివర్ణించారు. ఆదివారం మధిర నియోజకవర్గంలో పర్యటించిన ఆయన బోనకల్లు మండలం లక్ష్మీపురం గ్రామంలోని ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. జూనియర్ హాస్టల్, జూనియర్, సీనియర్, అడ్మినిస్ట్రేటివ్ భవనాల నిర్మాణాలను, మెకానికల్, సైన్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ ల్యాబ్ భవనాల నిర్మాణాలను పరిశీలిం చారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడవద్దని ఆయన ఆదేశించారు.

# మూసీ డీపీఆర్ తప్పుల తడక

### సీడబ్ల్యూసీ గైడ్లైన్స్ పాటించాలి

### నదికి ఇరువైపులా గోడ డేంజర్


### ప్రభుత్వం కోరితే డీపీఆర్ ఉచితంగా అందజేస్తాం

### రూ.100 కోట్లతో మొత్తం ప్రాజెక్ట్ పూర్తవుతుంది

### మూసీ పునరుజ్జీవంపై కేంద్ర జలవనరుల శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరాం

### పునరావాసం తర్వాతే పునరుజ్జీవం పనులు చేపట్టాలి

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్




**హైదరాబాద్ :** మూసీ పునరుజ్జీవం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన డీపీఆర్ అంతా తప్పుల తడకగా ఉందని, సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) మార్గదర్శకాలను మూసీ నదికి ఎలా అనుసంధానం చేయాలో డీపీఆర్లో లేదని మహారాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, కేంద్ర జలవనరుల శాఖ పూర్వ సలహాదారు వెదిరె శ్రీరామ్ అన్నారు. మొత్తం మూసీ నది పరివాహక ప్రాంతాన్ని ఒకే వ్యవస్థకింద నిర్వహించడానికి మూసీ రివర్ బేసిన్ అథారిటీని ఏర్పాటు చేసి, సమగ్ర బేసిన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. మూసీ నది ప నరుజ్జీవనం - వాస్తవాలు అంశంపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మూసీ నది పునరుద్ధరణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ.. మొత్తం మూసీ నదిని అప్పర్ స్ట్రెచ్, సిటీ స్ట్రెచ్, డౌన్ స్ట్రీమ్ మూడు భాగాలుగా విభజించారనీ, క్యాచ్మెంట్ ఏరియా ట్రీట్మెంట్ చేయకుండా ప్రధాన నది పునరుజ్జీవనం అసాధ్యమని పేర్కొన్నారు. సివరేజ్ నీరు నదిలోకి చేరకుండా కేవలం శుద్ధి చేసిన నీటినే మాత్రమే విడుదల చేయాలన్నారు. సహజ ప్రవాహ ప్రాంతంలో ఉన్న నిర్మాణాలు మాత్రమే తొలగించాలన్నారు. మూసీ ప్రాజెక్టులో భాగంగా ప్రొటెక్టెడ్ జోన్లో ఉన్న నిర్మాణాలను మాత్రమే తొలగించాలని, మిగతా రెగ్యులేటరీ జోన్, వార్నింగ్ జోన్లోని నిర్మాణాలను తొలగించాల్సిన అవసరం లేదనీ చెప్పారు. ఐదేళ్లకు, పాతికేళ్లకు, వందేళ్లకు వచ్చే వరదలను దృష్టిలో పెట్టుకుని పునరుజ్జీవం పనులు చేపట్టాలన్నారు. వీటిలో కేవలం ఐదేళ్లకోసారి వచ్చే వరదలకు ప్రభావితం అయ్యే ప్రొటెక్టెడ్ ప్రాంతాన్ని మాత్రమే తరలిస్తే సరిపోతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన డీపీఆర్లో పారదర్శకత లేదన్నారు. కేవలం పార్కులు, రీక్రియేషన్లు, రియల్ ఎస్టేట్లను ఉద్దేశించి మాత్రమే డీపీఆర్ను రూపొందించినట్లు స్పష్టం అవుతున్నట్టు చెప్పారు.

#### ముందే అన్ని నాలాలనూ అధ్యయనం చేయాలి

పునర్జీవనం పనులు మొదలు పెట్టే ముందు నగరంలోని అన్ని నాలాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉ ందన్నారు. నగరం నుంచి వచ్చే మురుగు నీ టిని ఎస్టీపీలకు అనుసంధానం చేయాలని చెప్పారు. నదికి ఇరువైపులా గోడ నిర్మాణం చేపట్టడం అంటే రివర్ను అరె- స్ట చేయడం లాంటిదన్నారు. దీనివల్ల గ్రౌండ్ వాటర్ రీచార్జ్ అయ్యే అవకాశం ఉండదని చెప్పారు. ప్రభుత్వం చేపడు తున్న పనులు జీవం లేని వ్యక్తికి పౌడర్ అద్దటం లాంటిదన్నారు. అది కూడా ఒకవైపు మాత్రమే అద్దుతున్నట్టు ప్రభుత్వ చర్యలు స్పష్టమవుతున్నట్టు తెలిపారు. ముందుగా నది ఆరోగ్యాన్ని పునరుద్ధరించడం అత్యవసరమని స్పష్టం చేశారు. ఏ ప్రాజెక్టు అయినా.. ఏడాది, రెండేళ్లలో పూర్తి కాదనీ, రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న థేమ్స్ నదికి 40 ఏళ్లు పట్టిందనీ వివరించారు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతున్న నేపథ్యంలో ఈ ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టు పనులు వచ్చే ప్రభుత్వం క రీడా కొనసాగించేలా అత్యంత పారదర్శకంగా డీపీఆర్ సిద్ధం చేయాల్సి ఉందనీ తెలిపారు. మూసీ డీపీఆర్ను ముక్కలుగా కాకుండా.. వికారాబాద్ నుంచి వాడప ల్లి వద్ద కృష్ణా నదిలో కలిసే వరకు సమగ్రమైన ప్లాన్ ఉ ండాలన్నారు.

#### డీపీఆర్ను ఉచితంగా అందిస్తా...

రాష్ట్ర ప్రభుత్వం కేవలం 21 కిలోమీటర్ల డీపీఆర్ తయారు చేయడానికే మాత్రమే రూ.160 కోట్ల వెచ్చించిందనీ, తాను తయారు చేసిన డీపీఆర్ ద్వారా మొత్తం ప్రాజెక్టు కేవలం రూ. 100 కోట్లలోనే పూ- ర్తవుతోందని వెదిరె శ్రీరామ్ అన్నారు. గోదావరి జలాలను మల్లన్న సాగర్ ద్వారా రూ.10 వేల కోట్లతో నగరానికి తీసుకొచ్చే బదులుగా మంజీరా వద్ద ఓవర్ ఫ్లో అయ్యే నీటిని నేరుగా వికారాబాద్ తీసుకొచ్చి మొత్తం మూసీ గోదావరి జలాలతో పారే అవకాశం ఉందన్నారు. తాను తయారు చేసిన డీపీఆర్ ను ప్రభుత్వం కోరితే ఉచితంగా అందజేస్తామన్నారు. సబర్మతి నదిని పునరుద్ధరించే సమయంలో 14 శాతం భూమిని రియల్ ఎస్టేట్కు ఇవ్వడం ద్వారా వచ్చిన రూ.1500 కోట్ల ఆదాయంలో రూ. 1100 కోట్లతో సబర్మతి నది పునరుద్ధరణ జరిగిన విషయం గుర్తు చేశారు. అలాగే మూసీ ప్రాజెక్టులో కూడా 10 శాతం భూమిని రియల్ ఎస్టేట్ కంపెనీలకు కేటాయించడం ద్వారా వచ్చిన నిధులతోనే మూసీ పునరుజ్జీవం పూర్తవుతోందని స్పష్టం చేశారు.

#### ప్రక్షాళనకు వ్యతిరేకం కాదు: రాంచందర్ రావు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ.. మూసీ శుద్ధికి తాము వ్యతిరేకం కాదని.. ఒకవేళ పేదల ఇళ్లు కూల్చాల్సి వస్తే ముందుగా పునరావాసం కల్పించి ప్రజలకు న్యాయం చేయాలని అన్నారు. ప్రధాని మోదీ నమామి గంగే ద్వారా వేల కిలో మీటర్ల గంగానదిని రూ.20 వేల కోట్లతో శుద్ధి చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన పేరుతో లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని చెబుతున్నారని విమర్శించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు మొదట రూ.5 వేల కోట్లు చెప్పిన ప్రభుత్వం ఒక్కసారిగా రూ.7 వేల కోట్లకు పెంచిందన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో 10 వేల ఇళ్లు కూల్చుతామని ఒక వైపు చెబుతూ అసెంబ్లీలో మాత్రం 1400 ఇండ్లు మాత్రమే అంటున్నారని.. ఇందులో ఏది నిజమో చెప్పాలన్నారు. 5 కిలోమీటర్ల వరకు బఫర్ జోన్ పేరుతో ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్ట్ పేరుతో వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో అవినీతి జరిగితే, ఇప్పుడు మూసీ ప్రాజెక్ట్ పేరుతో అదే పునరావృతం అవుతుందని ధ్వజమెత్తారు. మూసీ ప్రక్షాళన, సుందరీకరణ, టూరిజం అభివృద్ధికి బీజేపీ వ్యతిరేకం కాదన్నారు. కాని, అభివృద్ధి పేరుతో అవినీతికి వ్యతిరేకం అన్నారు.

# కాంగ్రెస్‌తో నాలుగు దశాబ్దాల అనుబంధం తెగిపోయింది

### ఇక నావల్ల కాదు

### 20 నెలల మానసిక క్షోభ వల్లే బయటకు రావల్సి వచ్చింది

### ఫిరాయింపుదారులే పార్టీని నడిపిస్తున్నారు

### మాజీ మంత్రి జీవన్ రెడ్డి వ్యాఖ్యలు



**జగిత్యాల :** కాంగ్రెస్ పార్టీలో ఇరవై నెలలుగా జరిగిన పరిణామాలతో తాను కొనసాగడం సాధ్యపడదని నిర్ధారణకు వచ్చి, ఆ పార్టీ నుంచి బయ టకు వెళ్లిపోతున్నానని, నా లుగు దశాబ్దాల అను బంధం తెగిపోయిందని ఏఐసీసీ స భ్యుడు, మాజీ మంత్రి తాటి పర్తి జీవన్రెడ్డి అన్నారు. పార్టీలో ఒక క్లారిటీ లేనప్పు డు కన్ఫ్యూజన్ గా ఉండే బదు లు బయటకు వెళ్లిపోవడమే మంచిదని నిర్ణయిం చుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి స్వస్తి చెప్పినట్లే అని, ఈ నెల 25న భవిష్యత్తు కార్యాచరణ కోసం తన శ్రేయోభిలాషులు, సహచర నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నానని, అదే రోజు కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వంతోపాటు ఏఐసీసీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇరవై నెలల నుంచి జగిత్యాలలో జరు గుతున్న పరిణామా లతో కాంగ్రెస్లో లో కొనసాగడంపై అలోచించుకోవాల్సి వచ్చిందని తెలిపారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల సమయంలో జరిగిన పరిణామా లతో కలవరం చెందినట్లు చెప్పారు. తన సమస్యకు పరిష్కారం లేకపోవడంతో పార్టీ నుంచి బయటకు రావాల్సి వచ్చిందని చెప్పారు. మంత్రి శ్రీధర్ బాబుతో మూడు దశాబ్దాల అనుబంధం ఉందని, ఆ అనుబం ధంతోనే ఆయన మాట్లాడారని, తన సమస్యకు ఎవర్ వద్దా పరిష్కారం లేదని చెప్పారు. ప్రతిపక్ష పార్టీగా దశాబ్ద కాలంగా పని చేసి, అధికారంలోకి వచ్చిన తర్వాత తమ హక్కులు కాలారాస్తుంటే ఎంతకాలం భరించాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని ఫిరాయిం పుదారులు నడిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయమే గౌరవమని.. ఆ గౌరవం లేకపోవడంతో పార్టీలో కొనసాగటం వల్ల ప్రయోజనం ఏమటని ప్రశ్ని ంచారు. తన పరిస్థితి వివరించిన తర్వాత శ్రీధర్ బాబు కూడా సమాధానం చెప్పలేకపోయారన్నారు. జగిత్యా లలో కాంగ్రెసు ఐక్యంగా నిలపడానికి ఎంతో మంది కార్యకర్తలు, నాయకులు అండగా నిలవడంతో ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. ఈ ఏడాది జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కార్యకర్తల హక్కుల కోసం పోరాటం చేశానని, తనలో అసహనం పెరుగుతోందని అన్నారు. ప్రత్యర్థిపై పోరాటం చేయటం సహజమే, కానీ సొంత పార్టీ పై పోరాటం చేయటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ నెల 25న జగిత్యాల పట్టణంలోని బండారి గార్డెన్లో రాజకీయ సహచరు. లు, అభిమానులు, శ్రేయోభిలాషులతో భవిష్యత్ కార్యా చరణ రూపొందించుకుంటానన్నారు. రాష్ట్ర నాయక త్వం అధిష్టానంపై నెట్టివేస్తోందని, తనకు అన్యాయం జరగడంలో ఎ ఎమ్మెల్యే పాత్ర సైతం ఉందన్నారు. తుమ్మిడిహెట్టి జాప్యంతో ఉత్తర తెలంగాణ కరువు తలెత్తే ప్రమాదం ఉందని, ఇంత వరకు మేడిగడ్డ పునరుద్ధరణ చేపట్టడం లేదని, కాంట్రాక్టర్ మరమ్మతు పనులు చేపట్టకపోతే ప్రభుత్వమే చేపట్టి, కాంట్రాక్టర్పై క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపుల ప్రభావం జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ పై ప్రభావం చూపుతుందని, మంత్రిగా తనకు అర్హత ఉందని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా మండలిలో ఒంటరి పోరు చేశానని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కలా తాను తన స్థాయిలో పోరాటం చేశానని గుర్తు చేశారు. జగిత్యాలతో తనకున్నా అనుబంధాన్ని ఎవరు తెంచలేరని, తన చివరి శ్వాస వరకు జగిత్యాలతో అనుబంధం కొనసాగు తుందన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత టి.జీవన్రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తానని ప్రకటించిన కొద్ది గంటల వ్యవధిలోనే జగిత్యాలలోని ఆయన నివాసం వద్ద అంటించిన ఓ పోస్టర్ చర్చనీయాంశంగా మారిం ది. తాను ఒక్కసారి చెబితే 100 సార్లు చెప్పినట్లే అని సినీ హీరో రజినీకాంత్ డైలాగ్ జీవన్ రెడ్డి ఫోటోతో దర్శనం ఇవ్వడం కొసమె- రుపు.

# రాష్ట్రంలో రాబందుల రాజ్యం


### రైతుల సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం

### రైతు గణపతిది ప్రభుత్వ హత్యే

### బీఆర్ఎస్ నేతలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్ :** రాష్ట్రంలో రైతు బంధు పాలనపోయి రాబందుల పాల న వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు ఆవే దన వ్యక్తం చేశారు. రైతు తు డుం గణపతి ఆత్మహత్య సంఘ టనను ఆయన తీవ్రంగా పరిగ ణించిన ఆయన రైతులు పోరాడి సాధించుకోవాలే కానీ ఆత్మహత్య లకు పాల్పడవద్దని కోరారు. రాబోయే కేసీఆర్ పాలనలో రైతులే రాజులుగా జీవి స్తారని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమాన్ని రేవం త్రెడ్డి సర్కార్ విస్మరించడంతో అన్నదాతలు ఆగమై పోతున్నారని విచారం వ్యక్తం చేశారు. వాస్తవానికి తుడుం గణపతిది ముమ్మాటికి ప్రభుత్వ హత్యనేనని కేటీఆర్ మండిపడ్డారు. ఆదివారం నందినగర్ లో బీఆర్ఎస్ నేతలతో మాట్లాడు తూ రైతుల పక్షాన ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీయాలని సూచించారు. రైతుల్లో మనో ధైర్యాన్ని నింపుతూ ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. పండించిన పంటను కాంగ్రెస్ సర్కారు కొనకపోవడంతో నానాకష్టాలు పడుతున్న రైతన్నల గోడు తెలుసుకునేందుకు స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ యార్డు వెళ్లానని గుర్తు చేశారు. అంతకు ముందురోజే మీడియాతో తుడుం గణపతి తన కష్టాలు చెప్పుకుని కన్నీళ్ల పర్యంతమయ్యాడని చెప్పారు. నాలుగు రోజులుగా మార్కెట్ యార్డులో ఉంటున్నా తన సోయాబీన్ పంటను కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. పంటను కొనకుండా వేధిస్తే తనకు మరణం తప్ప మరోమార్గం లేదని అప్పుడే రోదించిన విషయాన్ని గుర్తు చేశారు. రుణమాఫీ కాక, రైతుభరోసా రాక, అప్పుల బాధ తీవ్రమై మూడు రోజుల క్రితం గణపతి ఆత్మహత్య చేసుకున్నాడని విచారం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలం అర్లి(బి) గ్రామానికి రైతు తుడుం గణపతి 14 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని, దాదాపు రూ. 5 లక్షల పెట్టుబడి పెడితే.. సాగునీరు సరిగా లేక, ఎరువులు సమయానికి దొరక్క, పంట దిగుబడి తగ్గిందని, పండిన పంటను మార్కెట్కు తీసుకొస్తే కొనేవాళ్లు వెక్కివెక్కి ఏడ్చాడని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.



# గ్యాస్, పెట్రోల్, డీజిల్ కు నో ప్రాబ్లమ్

**దేశంలో ఇంధన కొరత లేదు**

**అధిక సామర్థ్యంతో పని చేస్తున్న రిఫైనరీలు .. నిలకడగా సరఫరా**

**దేశంలో ఇంధన పరిస్థితిపై ప్రధాని మోడీ సమీక్ష**

**ఎలాంటి ఇబ్బంది లేదని ప్రభుత్వ ప్రకటన**

న్యూఢిల్లీ: దేశంలో ఇంధన కొరత ఏమాత్రం లేదు. పెట్రోల్, డీజిల్ సరఫరా స్థిరంగా ఉంది. ఎల్పీజీ సరఫరా కూడా స్థిరంగా ఉంది. ఏ రకమైన కొరత లేదు. అన్ని రిఫైనరీలు అధిక సామర్థ్యంతో పనిచేస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఆదివారమిక్కడ ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్ష తన కేంద్ర మంత్రులతో కూడిన ఉన్నత స్థాయి సమా వేశం జరిగింది. ప్రధానినివాసంలో జరిగిన ఈ సమావేశానికి హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్నాథ్సంగ్, ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా, విదేశీ వ్యవహా రాల మంత్రి జైశంకర్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హాజర య్యారు. మధ్యప్రాచ్య పరిస్థితుల నేపథ్యంలో దేశంలో పెట్రోలియం, క్రూడ్ ఆయిల్, సహజ వాయువు, విద్యుత్, ఎరువుల సరఫరా పరిస్థితిని సమీక్షించారు. అనంతరం క్రూడ్ ఆయిల్ నిల్వలు తగినంతగా ఉన్నాయని ఒక ప్రకట నలో ప్రభుత్వం స్పష్టం చేసింది. అంతరాయం లేకుండా సరఫరా కొనసాగిం చడం, లాజిస్టిక్స్ స్థిరంగా ఉంచడం, దేశ వ్యాప్తంగా సమర్ధవంతమైన పంపి ణీపై దృష్టి సారించి నట్టు తెలిపింది. భవిష్యత్తులో ఏవైనా అంతరా యాలు రాకుండా జాగ్రత్తలు తీసుకుం టున్నాము. ప్రజలు ఆందో ళన చెందాల్సిన అవస రం లేదు. సరఫరా సాఫీగా సాగుతోం ది. ప్రభుత్వం పరి స్థితిని సమీక్షిస్తూ ఇంధన భద్రతను కాపాడు తోందని తెలిపింది. వాణిజ్య ఎల్పీజీ కేటాయింపు లను పెంచడం వంటి చర్య లుతీసుకున్నారు. పోర్టుల్లో ఎలాంటి ఇబ్బందులు లేవు. అమెరికా నుండి ఎల్పీజీ ట్యాంకర్లు రావడం మొదలైంది. ప్రజలు అధికారిక సమాచా రాన్ని మాత్రమే నమ్మాలి. వదంతులు నమ్మవద్దు. సరఫరా సాధారణంగా ఉంది అని పేర్కొంది.

# ప్రధాని మోడీ సరికొత్త చరిత్ర

**8,931 రోజులపాటు ప్రభుత్వాధినేతగా కొనసాగింపు**

**రాజకీయ ప్రస్థానంలో 25వ ఏడాదిలోకి అడుగు**

**వరుసగా మూడు సార్లు ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన**

**తొలి కాంగ్రెసేతర నేత,,, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అభినందనలు**

**న్యూ ఢిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశ రాజకీ య చరిత్రలో హిస్టరీ క్రియేట్ చేశారు. ప్రజాస్వా మ్యబద్ధంగా ఎన్నికైన ప్రభు త్వానికి అత్యధిక కాలం అధినేతగా పనిచేసిన భారతీయ నాయకు డిగా మోడీ రికార్డు । సృష్టించా రు. మాజీ సీఎం పవన్ చామ్లింగ్ రికార్డ్ బ్రేక్ చేశారు. 8,931 రోజులు గా ప్రభుత్వంలో కొనసాగుతు న్నా రు. మోడీ వరుసగా మూడు సార్లు బాధ్యతలు చేపట్టిన తొలి కాంగ్రెసే తర ప్రధానిగా కూడా మోడీ చరిత్ర లోకెక్కారు. ప్రస్తు తంమోడీరాజకీయ ప్రస్థానంలో 25వ ఏడాదిలోకి అడుగుపెట్టారు. అక్టోబర్ 7, 2001న గుజరాత్ ముఖ్యమం త్రిగా ప్రమాణస్వీ కారం చేసిన ఆయన సుమారు 13 ఏళ్ల పాటు ఆ పదవిలో కొనసా గారు. అనంతరం మే 26, 2014న దేశ14వ ప్రధాన మంత్రిగా బాధ్య తలు చేపట్టారు. 2014, 2019, 2024 లోక్సభఎన్నికల్లో వరుసగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించారు. ఆపై సుదీర్ఘకాలం ప్రజా మద్దతు కలిగిన నేతగా నిలిచారు. స్వతంత్ర భారత్లో జన్మిం చిన తొలి ప్రధా నిగా ఆయనే కావడం విశేషం. అలాగే, పూర్తి మెజా రిటీతో వరుసగా మూడుసార్లు బాధ్యతలు చేప ట్టిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా కూడా మోడీ చరి త్రలోకెక్కారు. సుదీర్ఘకాలం ప్రభుత్వ అధినేత: సుమారు 24 ఏళ్ల పాటు (గుజరాత్ సీఎంగా భారత ప్రధానిగా) సుదీర్ఘకాలం ఎన్నికైన పదవులలో కొన సాగిన నేత. 2014, 2019 మరియు 2024 లోక్సభఎన్నికలలో వరుసగా గెలిచి, 1984 తర్వాత పూర్తి మెజా రిటీతో హ్యాట్రిక్ సాధించిన మొదటి బీజేపీ ప్రధానిగా నిలిచారు. ఇన్స్టాలో 100 మిలియన్ల మంది ఫాలో వ ర్లను దాటిన ప్రపంచ నాయకుడిగా చరిత్ర సృష్టించా రు. గుజరాత్లో 13 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రి గా పనిచేసి పాలనాపరమైన రికార్డు సాధించారు. అనంతరం ప్రధానిగా కూడా అంతే సుదీర్ఘకాలం ప్రజల ఆశీర్వాదంతో ముందుకు సాగుతున్నారు.చాయ్ వాలా గాజీవితాన్ని ప్రారం భించిన మోదీ, ఆరెస్సెస్ కార్యకర్త నుండి గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆపై భారత ప్రధానిగా అంచెలంచెలుగా ఎదిగారు. అంత్యోదయ (క్యూలో ఉన్న చివరి వ్యక్తికి సే), సబ్కా సాథ్, సబ్కా వికాస్ నినాదాలతో ఆయన పాలన కొనసాగుతోంది. దేశ రాజకీయ చరిత్రలో ప్రధాని మోడీ ప్రభుత్వా ధినేతగా వరుసగా 8,931 రోజులు పాలన కొనసాగిస్తూ విశిష్టమైన చారిత్రాత్మక మైలురాయిని అధిగమించ డంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రాంచందర్ రావు హర్షం వ్యక్తం చేశారు. అత్యధిక కాలం పాటు ప్రభుత్వాధినేతగా సేవ సేవలందించిన నాయకుడిగా సేవలు అందిస్తున్నందుకు ఆదివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు.

# భిన్నత్వంలో ఏకత్వం మన దేశం

**గవర్నర్ శివప్రతాప్ శుక్లా .. లోకభవన్లో ఘనంగా బీహార్ అవతరణ దినోత్సవం**

**హైదరాబాద్ :** భిన్నత్వంలో ఏకత్వం మన దేశ ప్రత్యేకమని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' ఆధ్వర్యంలో లోక్ భవన్లో ఆదివారం నిర్వహించిన బీహార్ అవతరణ దినోత్సవానికి గవర్నర్, ఆయన సతీమణి జానకి శుక్లా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ శుక్లా ఈ వేడుకల్లో పాల్గొన్న వారికి, ఆహ్వానితులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బిహార్ రాష్ట్ర నిర్మాణం, అభివృద్ధిలో కీలక పాత్ర పోషిం చిన దూరదృష్టి కల్గిన నేతలకు, ప్రజలకు ఆయన ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ 1912 మార్చి 22న బెంగాల్ ప్రెసిడెన్సీ నుంచి వేరై బీహార్ బీహా రాష్ట్రం ఆవిర్భవించిందని చెప్పారు. స్వాతంత్ర్యం తరువాత బిహార్ దేశ సమగ్రాభివృద్ధిలో "దేశ సమగాభివృదిలో భాగస్వామ్యమై, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, రాజకీయ, విద్యా రంగాల్లో విశేష సేవలు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. నలందా, విక్రమశిల వంటి ప్రాచీన విశ్వ విద్యాలయాలు వికసించిన ప్రదేశంగా, బోధ్ గయలో బోధి వృక్షం కింద గౌతమ బుద్ధుడు జ్ఞానోదయం పొం దిన పవిత్ర భూమిగా బిహారున్న ప్రత్యేకతను ఆయన వివరించారు. వేడుకల్లో భాగంగా బిహార్ గవర్నర్ పంపిన వీడియో సందేశం ప్రదర్శించారు బిహార్ పర్యా టక శాఖ రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రజెంటేషనను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమా లు, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, కళాత్మక విన్యా సాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిషోర్, అదనపు డీజీ(ఇంటెలిజెన్స్) విజయ్ కుమార్, లోక్ భవన్ సీని యర్ అధికారులు, హైదరాబాద్లో నివసిస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన పలువురు అతిథులు పాల్గొన్నారు.

# 48 గంటల్లోగా జలసంధిని తెరవాలి

**లేదంటే మీ పవర్ ప్లాంట్లు పేల్చేస్తాం**

**ఇరాన్కు ట్రంప్ హెచ్చరిక**

**హోర్ముజ్ జలసంధిలో అణుజలాంతర్గామి**

**యూఎస్ మద్దతుగా యూకే మోహరింపు**

**ఇరాన్పై ఐక్యపోరాటం చేద్దాం**

**ప్రపంచ దేశాలకు ఇజ్రాయెల్ పిలుపు**

**మీకు నిలువ నీడ లేకుండా చేస్తాం**

**చుక్క నీరూ పుట్టనివ్వం**

**చమురు దొరక్కుండా కేంద్రాలు ధ్వంసం చేస్తాం**

**మీ స్థావరాల నామరూపాలుండవ్**

**జలసంధిలోకి శత్రునౌకలకు మాత్రమే నో ఎంట్రీ**

**ఎఫ్-15 ఫైటర్ జెట్ కూల్చేశాం**

**ఇరాన్ సైన్యం ప్రకటన**



**న్యూఢిల్లీ :** హోర్ముజ్ పూర్తిగా మూసేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఈ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవాలని లేనిపక్షంలో ఇరాన్ గ్యాస్, చమురు క్షేత్రాలపై బాంబులేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన హెచ్చరికలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఎలాంటి షరతుల్లేకుండా జలసం ధిని పూర్తిగా తెరవాలని ఇందుకోసం తాను 48గంటలు గడువిస్తున్నట్లు శనివారం రాత్రి ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్టులో హెచ్చరికలు జారీ చేశారు. తద్వారా ఆకాశాన్నం టుతున్న చమురు, సహజవాయువుల ధరల ఒత్తిడి నుంచి ప్రపంచానికి తాను ఉపశమనం కల్పిస్తానని ప్రకటించారు. అయితే ఈ హెచ్చరికలను ఇరాన్ ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. ట్రంప్ హెచ్చరికలు జారీ చేసిన కొన్ని గంటల్లోనే ఇరాన్ మరింత ఘాటుగా బదులిచ్చింది. తన దేశంలోని ఇంధన, మౌలిక సదుపాయాలపై దాడులు నిర్వహిస్తే మధ్యప్రాచ్యం లోని అమెరికా సైనిక స్థావరాల్లో పాటు మధ్యప్రాచ్య దేశాలు, ఇజ్రాయెల్లకు చెందిన అన్ని ఇంధన సమాచార, సాంకేతిక సదుపాయాల్తో పాటు ఉప్పునీటిని మంచినీటికి మారు-స్తున్న ప రిశ్రమలన్నింటిపైన దాడులు చేస్తామని ఇరాన్ అధికారిక వార్తా సంస్థ స్పష్టం చేసింది. ఇరాన్లోని టివిలన్నీ ఆదివారం ఇదే అంశాన్ని ప్రసారం చేశాయి. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగర్ ఘలీబాఫ్ క రీడా, తమ విద్యుత్ స్థావరాలపై దాడి జరిగితే ప్రాంతీయ ఇంధన, చమురు ప్లాంట్లను తిరిగి దెబ్బతీసి, చమురు ధరలు ఎక్కువ కాలం పాటు పెరిగిపోయేలా చేస్తామని హెచ్చరించారు. తమ ఆర్థిక సౌకర్యాలు లేదా బ్యాంకులపై దాడులు జరిగితే ప్రాంతంలోని అమెరికా, ఇజ్రాయెల్ సంబంధిత ఆర్థిక కేంద్రాలు, బ్యాంకులు, సైనిక స్థావరాలు ఇతర లక్ష్యాలను తిరిగి దెబ్బతీస్తామని ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) ఖతమ్ అల్ అన్బియా కమాండ్ ప్రకటనలో స్పష్టం చేసింది. ఇరాన్ సైనిక ప్రతినిధి జనరల్ అబోల్ఫజ్ షెకార్చి మాట్లాడుతూ, తమ శత్రువులకు సంబంధించిన పార్కులు, వినోద ప్రదేశాలు, పర్యాటక కేంద్రాలు ప్రపంచవ్యాప్తంగా సురక్షితం కావని హెచ్చరించారు. ఈ సౌకర్యాలను చట్టబద్ధ లక్ష్యాలుగా పరిగణిస్తామని, వాటిని తిరిగి మార్చలేని విధంగా నాశనం చేస్తామని ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుత యుద్ధం నాలుగో వారంలోకి ప్రవేశించింది. ప్రపంచ వ్యాప్తంగా ఇంధన కొరత ఏర్పడింది. యుద్ధంలో వెనుకంజేసేందుకు ఇరుపక్షాలు సిద్ధంగా లేవు. ఇప్పటికే అమెరికా, ఇజ్రాయెల్లు ఇరాన్లోని పలు స్థావరాలపై క్షిపణులు ప్రయోగించాయి. అలాగే ఇరాన్ కూడా ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై క్షిపణులు. డ్రోన్లను ప్రయోగిస్తోంది. కొన్ని ప్రభుత్వేతర సంస్థల నివేదికల మేరకు ఇప్పటి వరకు మధ యప్రాచ్యం, ఇరాన్లలో 4వేల మందికి పైగా మరణించారు. వీరిలో నాలుగింట మూడొంతుల మంది ఇరాన్ వాసులే. ఇరాన్ మద్దతున్న హిజ్బుల్లా మిలిటెంట్లపై కూడా ఇజ్రాయె ల్ దాడి చేసింది. దీంతో లెబనాన్లో మృతుల సంఖ్య వెయ్యిదాటింది. ఆమాటకొస్తే తన తాజా హెచ్చరికకు ఒక రోజు ముందు ఇరాన్పై సైనిక చర్యల్ని తగ్గించుకునే ప్రక్రియపై ఆలోచిస్తున్నామంటూ ట్రంప్ ప్రకటించారు. హోర్ముజ్ను పరిరక్షించే బాధ్యతను ఇతర దేశాలకు అప్పగిస్తామన్నారు. అయితే 24గంటలుకూడా ఆయన తన మాటపై నిలబడలేకపోయారు. ఇరాన్లోని అతిపెద్ద ఇంధన వ్యవస్థలపై దాడికి పాల్పడ్డారు. ఇందుకు ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్లోని అణుపరిశోధనా కేంద్రం సమీపంలో భారీ దాడులు చేసింది. కాగా ఇజ్రాయెల్ ప్రధాని నెతనాన్యాహు ఈ యుద్ధం తమ దేశానికి అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. తాము చాలా క్లిష్టపరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు స్పష్టం చేశారు.

## శత్రు నౌకలకు నో ఎంట్రీ

హోర్ముజ్ జలసంధిని శత్రు నౌకలకు తప్ప మిగతా అన్ని నౌకలకు తెరిచి ఉంచుతున్నామని ఇరాన్ ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన 48 గంటల గడువు తర్వాత ఈ ప్రకటన వచ్చింది. ఈ హెచ్చరికకు ప్రతిస్పందనగా ఇరాన్ అధికారి అలీ మౌసవి మాట్లాడుతూ జలసంధి శత్రుదేశాల నౌకలకు తప్ప మిగతా అన్ని నౌకలకు తెరిచి ఉందని తెలిపారు. ఇరాన్ శత్రువులుగా భావించే అమెరికా, ఇజ్రాయెల్ సంబంధిత నౌకలు తప్ప మిగతా దేశాల నౌకలు భద్రతా, సురక్షా ఏర్పాట్లను తమతో సమన్వయం చేసుకుని రావచ్చని చెప్పారు. సముద్ర మార్గాల సురక్షితత్వం పెంచడానికి, నావికుల రక్షణకు అంతర్జాతీయ సంస్థలతో సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని కూడా పేర్కొన్నారు.

# హోర్ముజ్ జలసంధిలో అణు జలాంతర్గామి

**యూఎస్ మద్దతుగా యూకే మోహరింపు**



**న్యూఢిల్లీ:** అణు శక్తితో నడిచే జలాంతర్గామిని హోర్ముజ్ జలసంధి సమీపంలో యూకే మోహరించింది. రాయల్ నేవీకి చెందిన హెచ్ఎంఎస్ అన్సన్ అనే ఆస్ట్యూట్ తరగతి దాడి సబ్మెరైన్ అరేబియన్ సముద్రంలో, ముఖ్యంగా ఉత్తర భాగంలో మోహరించింది. ఇది హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఉండి, ఇరాన్పై దాడులు చేయగల సామర్థ్యం కలిగి ఉంది. ఈ సబ్మెరైన్ మార్చి 6న ఆస్ట్రేలియాలోని పెర్త్ నుంచి బయలుదేరి సుమారు 5,500 మైళ్ల ప్రయాణం చేసి ఈ ప్రాంతానికి చేరుకుంది. ఇది 97 మీటర్ల పొడవు గలది. టామహాక్ బ్లాక్ 4 భూమి దాడి క్రూజ్ క్షిపణులతో సన్నద్ధమై ఉంది. ఇవి 1,600 కిలోమీటర్ల దూరం వరకు లక్ష్యాలను తాకగలవు. అలాగే స్పియర్ఫిష్ హెవీవెయిట్ టార్పిడోలు కూడా ఉన్నాయి. ఇది ఇరాన్ సైనిక లక్ష్యాలపై దాడులు చేయగల సామర్థ్యాన్ని ఇస్తుంది. ఈ మోహరింపు ఇరాన్ -అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం తీవ్రమవుతున్న నేపథ్యంలో జరిగింది. ఇరాన్ హోరుజ్ జలసంధిని మూసివేసి, నౌకల రవాణాను అడ్డుకుంటున్నది. దీంతో ప్రపంచ చమురు సరఫరాపై ప్రభావం పడుతోంది. బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ అమెరికాకు బ్రిటీష్ సైనిక బేసులను ఉపయోగించుకునే అనుమతి ఇచ్చారు. ఈ మోహరింపు ప్రాంతీయ యుద్ధాన్ని మరింత విస్తరింపజేసే అవకాశం ఉంది. బ్రిటన్ అమెరికాతో కలిసి హోర్ముజ్ జలసంధి సురక్షితం చేయడానికి సిద్ధంగా ఉందని సూచిస్తోంది.

# ఇరాన్పై ఐక్య పోరాటం చేద్దాం

**ప్రపంచదేశాలకు ఇజ్రాయెల్ పిలుపు**

న్యూఢిల్లీ: ఇరాన్పై ఐక్యంగా పోరాటం చేద్దామని ప్రపంచ దేశాలకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా ఇరాన్పై చేపట్టిన సైనిక చర్యల ద్వారా మొత్తం ప్రపంచాన్ని రక్షిస్తున్నామని అతడు పేర్కొన్నారు. ఇరాన్ అణు ఆయుధాలు, బాలిస్టిక్ క్షిపణుల బెదిరింపును తొలగించడమే లక్ష్యమని, ఇది ఇజ్రాయెల్ మాత్రమే కాకుండా ప్రపంచ భద్రతకు అవసరమని నెతన్యాహు స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్ ద్వారా ఇరాన్ ప్రజలు తమ భవిష్యత్తును తాము నిర్ణయించుకునే అవకాశం వస్తుందని, ఒక రోజు స్వేచ్ఛాయుత ఇరాన్తో ఇజ్రాయెల్ స్నేహం చేస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ అణు సామర్థ్యం, క్షిపణి బలగాలను నాశనం చేయడం ద్వారా భవిష్యత్ యుద్ధాలను నివారించవచ్చని, ఇది ప్రపంచశాంతికి మార్గం అవుతుందని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ఒంటరిగా కాకుండా అమెరికాతో కలిసి ఈ చర్యలు చేపట్టడం వల్ల ఇరాన్ దెబ్బతిన్నదని, యుద్ధం త్వరలో ముగిసే అవకాశం ఉందని కూడా తెలిపారు.

# ఎఫ్-15 ఫైటర్ జెట్ కూల్చేశాం

**హోర్మూజీ సమీపంలో ఘటన.. ఇరాన్ సైన్యం ప్రకటన.. వీడియో విడుదల**

న్యూఢిల్లీ: హోర్ముజ్ ద్వీపం సమీపంలో శత్రువులకు చెందిన ఎఫ్-15 ఫైటర్ జెట్ను గగనతల రక్షణ వ్యవస్థలతో కూల్చివేసినట్టు ఇరాన్ సైన్యం ప్రకటించింది. ఇరాన్ ఆర్మీ జాయింట్ ఎయిర్ డిఫెన్స్ కమాండ్ విడుదల చేసిన ప్రకటనలో, దేశ దక్షిణ తీరం పైన ఎగురుతున్న శత్రు ఫైటర్ జెట్ను గుర్తించి, ట్రాక్ చేసి, సర్ఫేస్-టు-ఎయిర్ మిస్సైల్తో లక్ష్యంగా చేసుకుని దెబ్బతీశామని తెలిపింది. ఈ ఘటన హోర్ముజ్ ద్వీపం సమీపంలో జరిగింది. జెట్ ఆకాశంలో ఇంటర్సెప్ట్ చేయబడి మిస్సైల్ దాడికి గురైంది. ఇరాన్ ప్రెస్ టీవీ, పార్స్ న్యూస్, తస్నీమ్ వంటి ప్రభుత్వ అధికారిక మీడియా ఈ వివరాలు వెల్లడించాయి. వారు ఒక వీడియో కా కూడా విడుదల చేశారు. అందులో గగనతల రక్షణ వ్యవస్థ ఎఫ్-15 ను లాక్ చేసి మిస్సైల్ ప్రయోగించినట్లు చూపించారు. జెట్ దక్షిణ తీరం పైన ఇప్పడింగ్ చేస్తుండగా ఇంటర్సెప్ట్ చేసి హిట్ చేశామని పేర్కొన్నారు. జె ఖచ్చితమైన పరిస్థితిపై ఇంకా దర్యాప్తు జరుగుతోందని, అది పూర్తిగా కూలిపోయిందని ధృవీకరించలేదని తెలిపారు. ఈ దాడి 48 గంటల అల్టిమేటమ్ ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన తర్వాత జరిగింది. హోర్మ్యాజ్ జలసంధిని తెరవాలని హెచ్చరించిన నేపథ్యంలో ఉద్రిక్తతలు పెరిగాయి. ఇరాన్ ఇది శత్రు జెట్ అని, అమెరికా లేదా ఇజ్రాయెల్ కు చెందినదని భావిస్తోంది. ఇది ఇటీవలి యుద్ధంలో నాలుగవ ఎఫ్-15 జెట్ లాస్ గా ఇరాన్ పేర్కొంది.

# ఇజ్రాయెల్ అణుశక్తి హబ్ పై ఇరాన్ ఎటాక్

**న్యూఢిల్లీ:** బాలిస్టిక్ క్షిపణులతో దిమోనా నగరంపై ఇరాన్ దాడి చేసింది, ఇది నాటాంజ్ అణు సౌకర్యంపై అమెరికా-ఇజ్రాయెల్ దాడికి ప్రతీకారంగా జరిగింది. దిమోనా నగరంపై జరిగిన ఇరాన్ క్షిపణి దాడి ఇజ్రాయెల్ అణు అస్పష్టత విధానాన్ని పరీక్షించింది. ఇజ్రాయెల్ దక్షిణ భాగంలోని దిమోనా నగరం సమీపంలో ఉన్న షిమోన్ పెరెస్ నెగెవ్ అణు పరిశోధనా కేంద్రం (దిమోనా రియాక్టర్ అని పిలుస్తారు) ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్ అణు ఆయుధాల స్థావరంగా భావిస్తారు. ఇజ్రాయెల్ అధికారి కంగా అణు ఆయుధాలు ఉన్నాయని ఒప్పుకోలేదు. కేవలం పరిశోధనా కేంద్రమని చెబుతుంది. అణు కేంద్రానికి నేరుగా దెబ్బ తగలలేదు. అంతర్జాతీయ అణు శక్తి సంస్థ ప్రకారం రేడియేషన్ స్థాయిలు సాధారణంగా ఉన్నాయి, కేంద్రానికి ఎలాంటి నష్టం జరగలేదు. ఇజ్రాయెల్పై తమ ట్రూ ప్రామిస్ 4 ఆపరేషన్ 73వ దశలో అరాద్, దిమోనా, బీర్ వా సహా దక్షిణ భాగంలోని సైనిక స్థావరాలు, భద్రతా కేంద్రాలపై దాడులు



చేశామని ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) తెలిపింది. ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలు కూలిపోయిన తత ఈ దాడులు జరిగాయని ఫత్తాహ్, ఖద్ర్, ఇమాద్ క్షిపణులు, డ్రోన్లను ఉపయోగించామని ఐఆర్జీసీ పేర్కొంది. ఈ దాడుల వల్ల దక్షిణ ఇజ్రాయెల్ లో 200 మందికి పైగా మరణాలు సంభవించాయని తెలిపింది. అరాద్, దిమోనా, బీర్ షెవా, ఏలత్, కిర్యత్ గాత్ వంటి ప్రాంతాల్లో సైనిక, భద్రతా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నామని చెప్పింది. ఇది ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధంలో యుద్ధ సమీకరణాలు వేగంగా మారుతున్నాయని, ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థలు కుప్పకూలుతున్నాయని ఐఆర్జీసీ పేర్కొంది. అయితే ఇజ్రాయెల్ వైపు నుంచి వచ్చిన సమాచారం ప్రకారం, ఈ దాడులు ప్రధానంగా అరాద్, దిమోనా నగరాల్లోని నివాస ప్రాంతాలపై జరిగాయి. అరాద్లో బహుళ భవనాలు దెబ్బతిని, దిమోనాలో కూడా నివాస భవనాలు కూలిపోయాయి. దాదాపు 180 మంది గాయపడ్డారు, వీరిలో కొందరు తీవ్రంగా గాయపడ్డారు. పిల్లలు కూడా గాయపడ్డారు, ఒక 10 ఏళ్ల బాలుడి పరిస్థితి విషమంగా ఉంది. సొరోకా ఆసుపత్రిలో 175 మందికి చికిత్స అందించారు, వీరిలో 36 మంది ఇంకా చికిత్సలో ఉన్నారు. ఈ దాడులు ఇరాన్ నాటాంజ్ అణు సౌకర్యంపై జరిగిన దాడికి ప్రతీకారంగా జరిగాయని భావిస్తున్నారు.

# మీకు ఈ అనారోగ్య సమస్యలు ఉన్నాయా..?

## అయితే ఏ పోషక పదార్థం లోపించిందో తెలుసుకోండి..!




మనం ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని రకాల పోషకాలు కలిగిన ఆహారాలను రోజూ తీసుకోవాల్సి ఉంటుంది. పోషకాలు మనకు రోజూ లభిస్తేనే అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటాం. ఎలాంటి రోగాలు రాకుండా అడ్డుకోవచ్చు. అనేక విటమిన్లు, మినరల్స్, ఇతర సమ్మేళనాలు, యాంటీ ఆక్సిడెంట్లు వంటివి పోషకాల జాబితాకు చెందుతాయి. ఇవన్నీ కేవలం ఒకే ఆహారంలో ఉండవు. కనుక మనం రోజూ ఇవన్నీ ఉండే భిన్న రకాల ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే పోషకాహార లోపం రాకుండా ఉంటుంది. అయితే ప్రస్తుతం ఉన్న ఉరుకుల పరుగుల బిజీ జీవితం కారణంగా చాలా మంది ఇంట్లో సరిగ్గా తినడం లేదు. బయటి ఆహారమే ఎక్కువగా తింటున్నారు. దీంతో పోషకాలు సరిగ్గా లభించక పోషకాహార లోపం వస్తోంది. దీని వల్ల అనేక వ్యాధులు, అనారోగ్య సమస్యలు వస్తున్నాయి.

**మెగ్నిషియం, జింక్..**

మన శరీరానికి అవసరం అయ్యే పోషకాలు లోపిస్తే వాటిని బట్టి భిన్న రకాల వ్యాధులు, అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. ఒక్కో పోషకాహార లోపాన్ని బట్టి భిన్న రకాల వ్యాధులు వస్తుంటాయి. ఇక మన శరీరానికి అవసరం అయ్యే పోషకాల్లో మెగ్నిషియం కూడా ఒకటి. ఇది అనేక జీవక్రియలకు సహాయం చేస్తుంది. మన శరీరంలో మెగ్నిషియం లోపిస్తే అరచేతులు తరచూ చల్లగా మారుతుంటాయి. శరీరం కూడా చల్లగా ఉంటుంది. అలాగే దీర్ఘకాలంలో దీని వల్ల హైపో థైరాయిడిజం, గుండె సమస్యలు కూడా వచ్చే అవకాశాలు ఉంటాయి. ఎవరికైనా ఈ లక్షణాలు కనిపిస్తుంటే మెగ్నిషియం లోపం ఉన్నట్లు భావించాలి. మెగ్నిషియం ఉన్న ఆహారాలను తినాల్సి ఉంటుంది. అలాగే మన శరీరానికి కావల్సిన మరో ముఖ్యమైన పోషక పదార్థం జింక్. ఇది లోపిస్తే చర్మంపై తరచూ చారలు ఏర్పడుతుంటాయి. రోగ నిరోధక శక్తి తగ్గి తరచూ దగ్గు, జలుబు వస్తుంటాయి. జుట్టు బలహీనంగా మారి చిట్లిపోతుంది. చుండ్రు అధికంగా ఉంటుంది.

**విటమిన్ కె, విటమిన్ సి..**

ఇక మన శరీరంలో విటమిన్ కె లోపిస్తే చిన్న దెబ్బలకే తీవ్ర రక్తస్రావం అవుతుంది. అలాగే గాయాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డకట్టదు. రక్తస్రావం అవుతూనే ఉంటుంది. ఎముకలు బలహీనంగా మారుతాయి. చిన్న దెబ్బలకే విరిగిపోతాయి. అలాగే మన శరీరంలో విటమిన్ సి లోపిస్తే రోగ నిరోధక శక్తి తగ్గి తరచూ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. దంతాలు, చిగుళ్ల నుంచి రక్తస్రావం అవుతుంది. అవి నొప్పిగా కూడా ఉంటాయి. చర్మంలో తేమ నశిస్తుంది. చర్మం పొడిగా మారి కాంతిహీనంగా కనిపిస్తుంది. అలాగే మెగ్నిషియం లోపించడం వల్ల తరచూ నిద్రలో కాలి పిక్కలు పట్టేస్తుంటాయి. విటమిన్ బి12 లోపం ఉన్నా కొందరిలో ఇలాగే జరుగుతుంది. మోకాళ్లు, కీళ్ల నొప్పులు, వాపులు తరచూ వస్తున్నా మెగ్నిషియం, విటమిన్ బి12 లోపించాయని అర్థం చేసుకోవాలి.

**అయోడిన్, విటమిన్ బి2..**

సాధారణంగా అయోడిన్ లోపం ఉంటే థైరాయిడ్ సమస్యలు వస్తుంటాయి. కొందరికి గొంతు దగ్గర థైరాయిడ్ గ్రంథి ఉండే ప్రాంతంలో వాపులు కూడా కనిపిస్తాయి. ఇది దీర్ఘకాలంలో హైపో లేదా హైపర్ థైరాయిడిజంకు దారి తీస్తుంది. థైరాయిడ్ సమస్య ఉన్నవారిలో అయోడిన్ కూడా లోపిస్తే థైరాయిడ్ మరింత తీవ్రతరం అయ్యే అవకాశాలు ఉంటాయి. థైరాయిడ్ కు మందులను వాడుతున్నా కూడా థైరాయిడ్ నియంత్రణలోకి రావడం లేదు అంటే అయోడిన్ లోపం ఉందేమో చెక్ చేసుకుని మందులను వాడాలి. అందుకు తగిన ఆహారం తినాలి. ఇక జింక్ లోపం ఉన్నవారిలో కొందరికి గోర్ల మీద తెల్లని మచ్చలు కనిపిస్తుంటాయి. గోళ్లు పెళుసుగా మారి చిట్లిపోతుంటాయి. అలాగే విటమిన్ బి2 లోపం ఉంటే ముఖం లేదా ముక్కుపై, నుదుటి మీద ఎర్రని దద్దుర్లు వస్తుంటాయి. ఇక శరీరంలో క్రోమియం స్థాయిలు తగ్గితే కళ్లలో శుక్లాలు ఏర్పడుతాయి. అలాగే షుగర్ లెవల్స్ కూడా పెరుగుతాయి. కళ్ల కింద నల్లని వలయాలు వస్తాయి. నాలుక పాలిపోయి తెల్లగా ఉంటే ఐరన్ లోపం ఉన్నట్లు గుర్తించాలి. ఇలా ఆయా పోషకాలు లోపిస్తే భిన్న రకాల అనారోగ్య సమస్యలు వస్తాయి. వాటిని గుర్తించడం ద్వారా ఏ పోషక పదార్థం లోపించిందో సులభంగా తెలుసుకుని అందుకు అనుగుణంగా మందులు లేదా ఆహారం తీసుకుంటే ఆ పోషక పదార్థ లోపం నుంచి సులభంగా బయట పడవచ్చు.

# ఈ లక్షణాలు మీలో కనిపిస్తున్నాయా..?

## అయితే మీరు నీళ్లను సరిగ్గా తాగడం లేదని అర్థం..!



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు వ్యాయామం చేయాలన్న విషయం అందరికీ తెలిసిందే. అలాగే రోజూ తగినంత నిద్ర ఉండాలి. తగినన్ని నీళ్లను కూడా తాగాలి. వేళకు భోజనం చేయాలి. అయితే చాలా మంది అన్నీ సరిగ్గానే పాటిస్తారు. కానీ పని ఒత్తిడి వల్ల, తీరిక లేని జీవితం వల్ల నీళ్లను సరిగ్గా తాగరు. కానీ రోజూ నీళ్లను కచ్చితంగా తగిన మోతాదులో తాగాల్సి ఉంటుంది. నీళ్లను సరిగ్గా తాగకపోతే శరీరంలోని అవయవాలకు పోషణ సరిగ్గా లభించదు. దీంతో అనేక వ్యాధులు వస్తాయి. అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తుంది. కనుక నీళ్లను తగిన మోతాదులో తాగాల్సి ఉంటుంది. అయితే మనం నీళ్లను సరిగ్గా తాగకపోతే మన శరీరం పలు సంకేతాలను, లక్షణాలను తెలియజేస్తుంది. వాటిని గుర్తించడం ద్వారా మనం నీళ్లను సరిగ్గా తాగడం లేదు అన్న విషయాన్ని సులభంగా తెలుసుకోవచ్చు.

**తలనొప్పి, మలబద్దకం..**

నీళ్లను సరిగ్గా తాగకపోతే డీహైడ్రేషన్ బారిన పడతారు. శరీరంలో ద్రవాల శాతం తగ్గుతుంది. ముఖ్యంగా తలనొప్పి వస్తుంది. మీకు తరచూ తలనొప్పి వస్తుంటే అందుకు ఒత్తిడి, ఆందోళన కారణం కాకపోతే మీరు నీళ్లను సరిగ్గా తాగుతున్నారో లేదో చెక్ చేసుకోండి. నీళ్లను తాగకపోవడం వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురై శరీరంలోని ద్రవాలు బయటకు వెళ్లి తలనొప్పి వస్తుంది. కనుక నీళ్లను తగిన మోతాదులో తాగాల్సి ఉంటుంది. దీంతో తలనొప్పి రాకుండా చూసుకోవచ్చు. అలాగే మలబద్దకం సమస్య తరచూ వస్తున్నా కూడా నీళ్లను సరిగ్గా తాగడం లేదని అర్థం. నీటిని తాగకపోతే మలం గట్టిపడి మలబద్దకం ఏర్పడుతుంది. విరేచనం సాఫీగా అవదు. మలబద్దకం ఉన్నవారు నీళ్లను సరిగ్గా తాగుతున్నారో లేదో చెక్ చేసుకోవాలి. నీళ్లను సరిగ్గా తాగకపోతే వాటిని తాగడం అలవాటు చేసుకోవాలి. దీని వల్ల మలబద్దకం తగ్గుతుంది.

**బీపీ..**

నీళ్లను సరిగ్గా తాగకపోతే శరీరంలో రక్త సరఫరాకు ఆటంకం ఏర్పడుతుంది. రక్త ప్రసరణ సరిగ్గా జరగదు. దీంతో బీపీ పెరుగుతుంది. మీకు ఉన్నట్టుండి కొన్ని రోజులుగా బీపీ పెరిగినట్లు అనిపిస్తే మీరు నీళ్లను సరిగ్గా తాగుతున్నారో లేదో చెక్ చేసుకోండి. నీళ్లను సరిగ్గా తాగకపోతే తాగండి. దీని వల్ల రక్త సరఫరా మెరుగు పడి బీపీ తగ్గుతుంది. గుండె కొట్టుకునే వేగం తగ్గుతుంది. అయితే నీళ్లను సరిగ్గా తాగకపోతే కొందరికి లోబీపీ వచ్చే అవకాశాలు కూడా ఉంటాయి. కనుక బీపీ పెరిగినా లేదా తగ్గినా మీరు నీళ్లను సరిగ్గా తాగుతున్నారా లేదా అనే విషయాన్ని గమనించాలి. దీని వల్ల బీపీ పెరగకుండా, తగ్గకుండా నియంత్రణలో ఉంచుకోవచ్చు. అలాగే గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

**కండరాలు..**

నీళ్లను తగిన మోతాదులో తాగకపోతే మూత్రం ముదురు గోధుమ రంగులో వస్తుంది. కొందరికి పసుపు రంగులో కూడా మూత్రం వస్తుంది. శరీరంలో నీటి శాతం తగ్గితే కండరాలు పట్టుకుపోతాయి. ముఖ్యంగా రాత్రి పూట నిద్రలో కాలి పిక్కలు పట్టుకుంటాయి. కాళ్లు, చేతుల్లో రక్త సరఫరా సరిగ్గా జరగక ఆయా భాగాల్లో తిమ్మిర్లు వస్తుంటాయి. శరీరంలో నీరు తగ్గినా లేదా నీళ్లను సరిగ్గా తాగకపోయినా దాని ప్రభావం చర్మంపై కూడా పడుతుంది. దీంతో చర్మం తేమను కోల్పోయి పొడిగా మారుతుంది. చర్మం సాగినట్లు మారుతుంది. అంద విహీనంగా కనిపిస్తుంది. తగినన్ని నీళ్లను తాగకపోతే రక్త సరఫరా సరిగ్గా లేక కీళ్ల నొప్పులు, వాపులు కూడా వస్తాయి. కనుక ఈ లక్షణాలు, సంకేతాలు కనిపిస్తుంటే కచ్చితంగా నీళ్లను సరిగ్గా తాగడం లేదని అర్థం చేసుకోవాలి. నీళ్లను రోజూ తగినంత మోతాదులో తాగుతుంటే ఈ అనారోగ్య సమస్యలు అన్నీ దూరం అవుతాయి. ఆరోగ్యంగా ఉంటారు.

# రక్త ప్రసరణపై చలి పంజా!



రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతున్నది. ఈ పరిస్థితి శరీరంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. రక్తనాళాలు కుచించుకుపోయి.. రక్తం గడ్డకట్టే ప్రమాదం ఉంటుంది. సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే.. సమస్య మరింత ముదురుతుంది. చలికాలం వచ్చిందంటే.. కొందరిలో కాళ్లు, చేతులు ముడుచుకు పోతుంటాయి. వేళ్లలో వాపు, దురద లాంటి సమస్యలు కనిపిస్తాయి. వాతావరణంలో చలి పెరగడమే ఇందుకు కారణం. రక్త ప్రసరణపై చలి ప్రభావం వల్లే ఇలాంటి సమస్యలు ఎదురవుతాయని నిపుణుల మాట. ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య ఎక్కువ ప్రభావం చూపుతుంది. తెల్లవారుజామునే లేవడం, చలిలో వాకిలి ఊడ్చడం, కల్లాపి చల్లడం లాంటి పనులు చేస్తుంటారు.


వంట గదిలోనూ కూరగాయలు కడగడం, అంట్లు తోమడం లాంటి నీటితో చేసే పనుల్లోనే రోజంతా తలమునకలై ఉంటారు. చలి తీవ్రత, చల్లని నీటి ప్రభావం వల్ల వారి శరీరంలో సిరలు కుంచించుకుపోతాయి. దాంతో రక్త ప్రసరణ నెమ్మదిస్తుంది. కొన్నిరోజులకు రక్తం గడ్డకట్టడం మొదలవుతుంది. ఫలితంగా.. కాళ్లు, చేతుల వేళ్లలో వాపు కనిపిస్తుంది. సమస్య ముదిరితే.. దురదతోపాటు నొప్పి కూడా వస్తుంది. దీనివల్ల రోజువారీ పనులలో తీవ్రమైన ఇబ్బంది కలుగుతుంది.

**సమస్యకు పరిష్కారం?**

చలికాలంలో చాలామందిలో కాళ్లు, చేతులలో వాపు సాధారణంగానే కనిపిస్తుంది. అయితే, నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన సమస్యగా మారుతుంది. ఎక్కువ చలిగా ఉన్నప్పుడు బయటికి రాకపోవడమే మంచిది. కాళ్లు, చేతులను కప్పి ఉంచేలా వెచ్చని దుస్తులు ధరించాలి. శరీరం డీహైడ్రేషన్‌కు గురవడం వల్లకూడా ఈ సమస్య కనిపిస్తుంది. కాబట్టి, తగినంత నీరు తీసుకోవాలి. వేళ్ల వాపును తగ్గించడానికి చిన్నచిన్న స్ట్రెచెస్, వ్యాయామాలను ఆశ్రయించాలి. సమస్య మరీ తీవ్రంగా ఉంటే.. వైద్యులను సంప్రదించాలి.

# రాత్రి పూట తినాల్సిన పండ్లు ఇవే..

## వీటిని తింటే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి..!



ఎప్పటికప్పుడు సీజన్లలో లభించే పండ్లతోపాటు మనకు ఏడాది పొడవునా అందుబాటులో ఉండే పండ్లను తరచూ తినడం వల్ల మనకు ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయన్న విషయం అందరికీ తెలిసిందే. అందుకనే పండ్లను రోజూ తినాలని పోషకాహార నిపుణులు, వైద్యులు సూచిస్తుంటారు. పండ్లను తినడం వల్ల అనేక పోషకాలు లభిస్తాయి. అనేక రకాల విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లను మనం పండ్ల ద్వారా పొందవచ్చు. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచేందుకు ఎంతగానో దోహదం చేస్తాయి. కొందరు పండ్లను కేవలం జ్వరం వచ్చినప్పుడు లేదా అనారోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే తింటారు. కానీ పండ్లను రోజూ తినాల్సిందేనని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అయితే పగటి పూట పండ్లను తినడం వీలు కావడం లేదన్న వారు రాత్రి పూట వాటిని తినవచ్చు. కానీ రాత్రి పూట ఏ పండ్లను పడితే వాటిని తినకూడదు. రాత్రి పూట తినదగిన పండ్లు కొన్నే ఉన్నాయి. వాటిని ఆహారంలో భాగం చేసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది.

**కివి పండ్లు..**


రాత్రి పూట తినదగిన పండ్లలో కివిలు ప్రథమ స్థానంలో నిలుస్తాయని చెప్పవచ్చు. ఈ పండ్లను తినడం వల్ల మన శరీరంలో సెరటోనిన్ ఉత్పత్తి అవుతుంది. ఇది నిద్రను ప్రేరేపించే హార్మోన్. దీని వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి తగ్గుతుంది. అలాగే ఈ పండ్లను తింటుంటే యాంటీ ఆక్సిడెంట్లు పెద్ద మొత్తంలో లభిస్తాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. కివి పండ్లను రాత్రి పూట తినడం వల్ల జీర్ణ వ్యవస్థకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ పండ్లలో అధికంగా ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీని వల్ల ఆహారం సరిగ్గా జీర్ణం అవుతుంది. అజీర్తి తగ్గుతుంది. అలాగే మలబద్దకం నుంచి ఉపశమనం లభిస్తుంది.

**చెర్రీలు, అరటి పండ్లు..**

ఇక రాత్రి పూట తినాల్సిన పండ్లలో చెర్రీలు కూడా ఒకటి. ఈ పండ్లను తినడం వల్ల మన శరీరంలో మెలటోనిన్ ఉత్పత్తి అవుతుంది. ఇది కూడా నిద్రను ప్రేరేపిస్తుంది. ఒత్తిడి, ఆందోళన నిద్రలేమి సమస్యలు ఉన్నవారు రాత్రి పూట ఈ పండ్లను తింటుంటే ఉపయోగం ఉంటుంది. చెర్రీ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఫలితంగా దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. ఇక రాత్రి పూట అరటి పండ్లను తినవచ్చు. కానీ కఫం అధికంగా ఉత్పత్తి అయ్యే వారు, అధిక బరువు ఉన్న వారు ఈ పండ్లను రాత్రి పూట తినకూడదు. మిగిలిన ఎవరైనా ఈ పండ్లను రాత్రి పూట తినవచ్చు. అరటి పండ్లను రాత్రి పూట తినడం వల్ల మెగ్నిషియం అధికంగా లభిస్తుంది. దీని వల్ల రాత్రి పూట నిద్రలో కాలి పిక్కలు పట్టుకుపోకుండా ఉంటాయి. అలాగే అరటి పండ్లలో ఉండే పొటాషియం శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరిచి బీపీని నియంత్రిస్తుంది. దీని వల్ల రాత్రి పూట బీపీ పెరగకుండా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు.

**బెర్రీలు, అవకాడో..**

ఇక రాత్రి పూట బ్లూబెర్రీలు, రాస్ప్ బెర్రీలను కూడా తినవచ్చు. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మనకు నిద్ర చక్కగా పట్టేలా చేస్తాయి. నిద్రలేమిని తగ్గిస్తాయి. అలాగే క్యాన్సర్ కణాలతో పోరాటం చేస్తాయి. క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటాయి. రాత్రి పూట అవకాడో పండ్లను సైతం తినవచ్చు. వీటిల్లో ఉండే మెగ్నిషియం రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోకుండా చూస్తుంది. ఈ పండ్లలోని మోనో అన్‌శాచురేటెడ్ ఫ్యాట్లు కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. దీంతో రాత్రి పూట ఆహారం ఎక్కువగా తినకుండా జాగ్రత్త పడవచ్చు. దీని వల్ల బరువు తగ్గడం తేలిగ్గా మారుతుంది. అలాగే రాత్రి పూట పుచ్చకాయలు, తర్బూజాలను కూడా తినవచ్చు. అతి మూత్ర వ్యాధి ఉంటే వీటిని తినకూడదు. రాత్రి పూట ఈ పండ్లను తినడం వల్ల శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. దీని వల్ల మలబద్దకం తగ్గుతుంది. అంతేకాకుండా నిద్ర చక్కగా పడుతుంది. ఇలా రాత్రి పూట ఆయా పండ్లను తింటుంటే ఎంతగానో మేలు జరుగుతుంది.



# ఐపీఎల్ ఆరెంజ్ క్యాప్

## కోహ్లీ అరుదైన రికార్డు.. ఇప్పటివరకు విజేతలు వీరే!

క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ ఎడిషన్ ఈ నెల 28 నుంచి ప్రారంభం కానుంది. 2008లో మొదలైన ఈ క్యాష్ రిచ్ లీగ్, అనతికాలంలోనే ప్రపంచవ్యాప్తంగా అశేష ప్రేక్షకాదరణ పొందింది. ప్రతి సీజన్‌లోనూ బ్యాటర్లు, బౌలర్ల మధ్య హోరాహోరీ పోరు జరుగుతుంది. ఈ క్రమంలో ఒక సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌కు ఇచ్చే ప్రతిష్ఠాత్మక 'ఆరెంజ్ క్యాప్'కు ఎంతో ప్రత్యేకత ఉంది. ఈ నేపథ్యంలో గడిచిన 18 సీజన్లలో ఈ ఘనత సాధించిన ఆటగాళ్లెవరో ఒకసారి చూద్దాం.

ఆరెంజ్ క్యాప్ చరిత్రలో కొన్ని రికార్డులు అభిమానుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ముఖ్యంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 2016 సీజన్‌లో సృష్టించిన రికార్డు అసాధారణమైంది. ఆ సీజన్‌లో పరుగుల వరద పారించిన కోహ్లీ, ఏకంగా 973 పరుగులు చేసి, ఒకే ఐపీఎల్ ఎడిషన్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా చరిత్రకెక్కాడు. ఇప్పటికీ ఈ రికార్డు చెక్కుచెదరలేదు. మరోవైపు ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ డేవిడ్ వార్నర్ అత్యధికంగా మూడుసార్లు (2015, 2017, 2019) ఆరెంజ్ క్యాప్‌ను కైవసం చేసుకుని తన ఆధిపత్యాన్ని చాటాడు. 'యూనివర్స్ బాస్' క్రిస్ గేల్ వరుసగా రెండు సీజన్లలో (2011, 2012) ఈ క్యాప్‌ను గెలుచుకోగా, కోహ్లీ కూడా రెండుసార్లు ఈ ఘనతను అందుకున్నాడు.

### సీజన్ల వారీగా ఆరెంజ్ క్యాప్ విజేతలు:

2008: షాన్ మార్ష్ (పంజాబ్) – 616 పరుగులు
2009: మాథ్యూ హేడెన్ (చెన్నై) – 572 పరుగులు
2010: సచిన్ టెండూల్కర్ (ముంబై) – 618 పరుగులు
2011: క్రిస్ గేల్ (ఆర్సీబీ) – 608 పరుగులు
2012: క్రిస్ గేల్ (ఆర్సీబీ) – 733 పరుగులు
2013: మైక్ హస్సీ (చెన్నై) – 733 పరుగులు
2014: రాబిన్ ఉతప్ప (కేకేఆర్) – 660 పరుగులు
2015: డేవిడ్ వార్నర్ (సన్‌రైజర్స్) – 562 పరుగులు
2016: విరాట్ కోహ్లీ (ఆర్సీబీ) – 973 పరుగులు
2017: డేవిడ్ వార్నర్ (సన్‌రైజర్స్) – 641 పరుగులు
2018: కేన్ విలియమ్సన్ (సన్‌రైజర్స్) – 735 పరుగులు
2019: డేవిడ్ వార్నర్ (సన్‌రైజర్స్) – 692 పరుగులు
2020: కేఎల్ రాహుల్ (పంజాబ్) – 670 పరుగులు
2021: రుతురాజ్ గైక్వాడ్ (చెన్నై) – 635 పరుగులు
2022: జోస్ బట్లర్ (రాజస్థాన్) – 863 పరుగులు
2023: శుభ్‌మన్ గిల్ (గుజరాత్) – 890 పరుగులు
2024: విరాట్ కోహ్లీ (ఆర్సీబీ) – 741 పరుగులు
2025: సాయి సుదర్శన్ (గుజరాత్) – 759 పరుగులు

తొలి సీజన్‌లో షాన్ మార్ష్ ఈ ఘనత అందుకోగా, ఇటీవల ముగిసిన 2025 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ యువ ఆటగాడు సాయి సుదర్శన్ ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్నాడు. మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న 19వ సీజన్‌లో ఈ ప్రతిష్ఠాత్మక క్యాప్‌ను ఏ బ్యాటర్ గెలుచుకుంటాడోనని అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

# ఐపీఎల్ మధ్యలో చార్టర్డ్ ఫ్లయిటా?

## ఇన్‌స్టా పోస్టుపై కోహ్లీ రియాక్షన్




టీమిండియా స్టార్ బ్యాటర్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ తనపై వస్తున్న కొన్ని వార్తలను నవ్వుతూ కొట్టిపారేశాడు. ఐపీఎల్ 2026 సీజన్ మధ్యలో లండన్ వెళ్లేందుకు తాను చార్టర్డ్ విమానం అడిగినట్లు వచ్చిన ప్రచారాన్ని "ఫేక్ న్యూస్" అని తేల్చేశాడు. వివరాల్లోకి వెళితే, 'వరల్డ్‌ఇన్‌లాస్ట్24అవర్స్' అనే ఓ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కోహ్లీ గురించి ఒక పోస్ట్ చేశారు. దాని ప్రకారం, ఐపీఎల్ మ్యాచ్‌ల మధ్య మూడు రోజుల కంటే ఎక్కువ గ్యాప్ ఉన్నప్పుడు లండన్ వెళ్లి రావడానికి కోహ్లీ ఆర్‌సీబీ యాజమాన్యాన్ని చార్టర్డ్ ఫ్లయిట్ సౌకర్యం కోరినట్టు అందులో పేర్కొన్నారు. ఈ పోస్ట్ తన దృష్టికి రావడంతో, కోహ్లీ దాని స్క్రీన్‌షాట్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పంచుకున్నాడు. దానికి నవ్వుతున్న ఎమోజీలను జతచేసి, ఆ వార్తల్లో నిజం లేదని పరోక్షంగా స్పష్టం చేశాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే, కోహ్లీ స్పందనతో తమ అకౌంట్ క్రాష్ అయిందంటూ సదరు ఇన్‌స్టాగ్రామ్ పేజీ మరో పోస్ట్ చేసింది. ఇదిలా ఉండగా, కోహ్లీ ఇటీవలే ఆర్‌సీబీ జట్టుతో కలిసి తొలి ట్రైనింగ్ సెషన్‌లో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా సహచర ఆటగాళ్లను ఉద్దేశించి స్ఫూర్తిదాయకంగా ప్రసంగించాడు. "గతేడాది మనం సాధించిన విజయం కోసం గత రెండు, మూడు సీజన్లుగా చాలా కష్టపడ్డాం. ఈసారి అది మరింత కఠినం కానుంది. ఎందుకంటే మిగతా జట్లు మనపై గట్టిగా పోటీకి వస్తాయి. ఈ రెండున్నర నెలలు ఒక్క నిమిషం కూడా వృథా చేయకుండా 120 శాతం కష్టపడాలి" అని కోహ్లీ తన సహచరులకు పిలుపునిచ్చాడు. హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ కొత్త ఆటగాళ్లకు జట్టులోకి స్వాగతం పలికిన అనంతరం కోహ్లీ ఈ ప్రసంగం చేశాడు.

# ఢిల్లీకి తిరిగొచ్చిన పృథ్వీ షా

## "మీ అబ్బాయి ఇంటికొచ్చాడు" అంటూ భావోద్వేగం




భారత యువ ఓపెనర్ పృథ్వీ షా తన ఐపీఎల్ ప్రస్థానం మొదలైన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి తిరిగి వచ్చాడు. మార్చి 28 నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ 19వ సీజన్ కోసం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఏర్పాటు చేసిన జట్టు శిక్షణా శిబిరంలో అతడు ఇవాళ అడుగుపెట్టాడు. ఈ సందర్భంగా తన పునరాగమనంపై తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. ఏడేళ్ల పాటు ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన పృథ్వీ షాను, ఐపీఎల్ 2025 వేలానికి ముందు ఫ్రాంచైజీ విడుదల చేసింది. ఆ తర్వాత జరిగిన వేలంలో అతడిని కొనుగోలు చేసేందుకు ఏ జట్టూ ఆసక్తి చూపకపోవడంతో అన్‌సోల్డ్‌గా మిగిలాడు. ఈ ఏడాది జరిగిన ఐపీఎల్ 2026 వేలంలోనూ మొదట అతడికి నిరాశే ఎదురైంది. కానీ, చివరి రౌండ్‌లో (యాక్సిలరేటెడ్ ఫేజ్) అనూహ్యంగా ఢిల్లీ క్యాపిటల్సే అతడిని రూ. 75 లక్షల కనీస ధరకు కొనుగోలు చేసి తిరిగి జట్టులోకి తీసుకుంది. ఈ నేపథ్యంలో సొంత గూటికి చేరిన పృథ్వీ షాపై ఢిల్లీ క్యాపిటల్స్ ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. 'మన అబ్బాయి ఇంటికి తిరిగొచ్చాడు' అనే క్యాప్షన్‌తో ఈ వీడియోను పంచుకుంది. అందులో పృథ్వీ షా మాట్లాడుతూ.. "కోట్లా (అరుణ్ జైట్లీ స్టేడియం) లాంటి ప్రదేశాన్ని ఎవరూ మర్చిపోలేరు. అక్కడి శబ్దాన్ని, నిశ్శబ్దాన్ని మర్చిపోలేం. కొన్ని కథలు ముగిసిపోవు, తిరిగి వస్తాయి. ఢిల్లీ.. మీ అబ్బాయి ఇంటికి వచ్చేశాడు" అని భావోద్వేగంగా వ్యాఖ్యానించాడు. 2018లో అండర్-19 ప్రపంచకప్ గెలిచిన తర్వాత పృథ్వీ షాను ఢిల్లీ జట్టు రూ. 1.2 కోట్లకు కొనుగోలు చేసింది. ఢిల్లీ తరఫున ఏడు సీజన్లలో 79 మ్యాచ్‌లు ఆడిన షా, 23.5 సగటుతో 1,892 పరుగులు చేశాడు. ఇందులో 14 అర్ధ సెంచరీలు ఉన్నాయి. గత సీజన్‌లో ఢిల్లీ జట్టు 14 మ్యాచ్‌లలో 7 విజయాలతో ఐదో స్థానంలో నిలిచి ప్లేఆఫ్స్ అవకాశాన్ని త్రుటిలో కోల్పోయింది. ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ ట్రోఫీ గెలవని ఆ జట్టు, ఈ సీజన్‌లోనైనా ఆ కలను నెరవేర్చుకోవాలని పట్టుదలగా ఉంది. బీసీసీఐ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 1న లక్నోలోని ఏకానా స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్‌తో ఢిల్లీ తన తొలి మ్యాచ్ ఆడనుంది.

# ఐపీఎల్ ముందు అభిషేక్ శర్మ విధ్వంసం

## 42 బంతుల్లో 94 పరుగులు!

ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) స్టార్ బ్యాటర్, వరల్డ్ నెం.1 టీ20 ఆటగాడు అభిషేక్ శర్మ ప్రత్యర్థి జట్లకు గట్టి హెచ్చరిక పంపాడు. నిన్న జరిగిన ఫ్రాంచైజీ అంతర్గత ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఈ యువ ఓపెనర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 42 బంతుల్లోనే 94 పరుగులు బాది విధ్వంసం సృష్టించాడు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో 21 బంతుల్లో 52 పరుగులతో మెరిసిన అభిషేక్, ఇప్పుడు అదే ఫామ్‌ను కొనసాగించాడు. ఎస్ఆర్‌హెచ్ 'ఏ' జట్టు తరఫున ఆడిన అతను జట్టుకు భారీ స్కోరు అందించడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా స్టార్ హెన్రిచ్ క్లాసెన్ (31 బంతుల్లో 49), యువ పవర్ హిట్టర్ సలీల్ అరోరా (16 బంతుల్లో 47) కూడా మెరుపులు మెరిపించారు. వీరి ప్రదర్శనతో ఎస్ఆర్‌హెచ్ 'ఏ' జట్టు 21 ఓవర్లలో 9 వికెట్లకు 253 పరుగుల భారీ స్కోరు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో ఎస్ఆర్‌హెచ్ 'బీ' జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన ఇషాన్ కిషన్ కేవలం 25 బంతుల్లోనే 72 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ సీజన్‌లోని తొలి కొన్ని మ్యాచ్‌లకు దూరం కానున్న నేపథ్యంలో ఇషాన్ జట్టుకు సారథ్య బాధ్యతలు చేపట్టనున్నాడు. రూ. 1.50 కోట్లకు అమ్ముడైన యువ వికెట్ కీపర్ సలీల్ అరోరా తన మెరుపు ఇన్నింగ్స్‌తో తుది జట్టులో స్థానం కోసం గట్టి పోటీ ఇస్తున్నాడు. బౌలింగ్‌లో వెటరన్ పేసర్ జయదేవ్ ఉనద్కత్ 48 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టడం విశేషం. ఈ నెల 28న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో ఎస్ఆర్‌హెచ్ తమ తొలి మ్యాచ్ ఆడనుంది.



# భారత్ కోసం ఐర్లాండ్ పర్యటన రద్దు

## కానీ టీమిండియా సిరీస్‌పై వీడని సందిగ్ధత

బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరగాల్సిన తమ ఐర్లాండ్ పర్యటనను వాయిదా వేసింది. అదే సమయంలో భారత జట్టుతో స్వదేశంలో వైట్-బాల్ సిరీస్ ఆడేందుకు బీసీబీ ఆసక్తి చూపుతోంది. ఈ మేరకు భారత్‌తో సిరీస్ కోసం షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. అయితే, ఇరు దేశాల మధ్య ఇటీవల నెలకొన్న దౌత్యపరమైన ఉద్రిక్తతల కారణంగా ఈ సిరీస్‌కు భారత ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి అనుమతి లభించలేదు. దీంతో బంగ్లా ఆశలపై నీలినీడలు కమ్ముకున్నాయి.

బీసీబీ విడుదల చేసిన తాత్కాలిక షెడ్యూల్ ప్రకారం... భారత జట్టు ఆగస్టు 28న బంగ్లాదేశ్‌కు చేరుకుంటుంది. సెప్టెంబర్ 1, 3, 6 తేదీల్లో మూడు వన్డేల సిరీస్, ఆ తర్వాత సెప్టెంబర్ 9, 12, 13 తేదీల్లో మూడు టీ20ల సిరీస్ జరగాల్సి ఉంది. వాస్తవానికి ఈ సిరీస్ గతేడాది జరగాల్సి ఉండగా, ఈ సెప్టెంబర్‌కు మార్చారు. దీంతో అదే సమయంలో ఉన్న ఐర్లాండ్ పర్యటనను వాయిదా వేయాలని బీసీబీ నిర్ణయించుకుంది. ఈ విషయమై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధికారి ఒకరు మాట్లాడుతూ... "భారత్‌తో సిరీస్ ఖరారు కావడంతో



ఐర్లాండ్ పర్యటనను 2026లో మరో సమయంలో నిర్వహించగలరా? అని క్రికెట్ ఐర్లాండ్‌ను కోరాము. కానీ, వారు అందుకు అంగీకరించలేదు. దీంతో ఈ పర్యటన వాయిదా పడింది. బహుశా వచ్చే ఏడాది (2027) ఈ సిరీస్‌కు కొత్త విండోను కనుగొంటాం" అని తెలిపారు.

### అనుమతిపై అనిశ్చితి ఎందుకు?

ఇటీవల ఇరు దేశాల క్రికెట్ బోర్డుల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు కోల్‌కతా నైట్‌రైడర్స్ (ఖఖ=) పేసర్ ముస్తాఫిజుర్ రహ్మాన్‌ను విడుదల చేయడంతో వివాదం మొదలైంది. దీనికి నిరసనగా భారత్‌లో జరిగే టీ20 ప్రపంచకప్ 2026 గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లు ఆడేందుకు బంగ్లాదేశ్ నిరాకరించింది. ఫలితంగా ఆ టోర్నమెంట్‌కే దూరమైంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో పర్యటించేందుకు భారత జట్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించే విషయంపై సందిగ్ధత నెలకొంది. ఇదిలా ఉంటే... బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తమ అంతర్గత వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యం పెరిగిపోయిందని ఆరోపిస్తోంది. బోర్డు ఎన్నికల ప్రక్రియపై విచారణకు జాతీయ క్రీడా మండలి ఒక కమిటీని ఏర్పాటు చేయడాన్ని బీసీబీ తప్పుబట్టింది. ఈ అంశంపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)తో అనధికారికంగా చర్చలు జరిపినట్లు కూడా బీసీబీ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం తమది రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన బోర్డు అని, తమ కార్యకలాపాల్లో జోక్యాన్ని సహించబోమని స్పష్టం చేసింది. ఈ పరిణామాల మధ్య భారత్‌తో సిరీస్ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

# జల సంరక్షణతోనే నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం




కరీంనగర్, మార్చి 22: వేసవి కాలంలో భూగర్భ జలాలు తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జల సంరక్షణపై దృష్టి పెట్టాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం స్థానిక వైశ్య భవన్‌లో మానేరు పర్యావరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా "సుజలాం సుఫలాం" గోడపత్రాలను ఆవిష్కరించారు. మేయర్ మాట్లాడుతూ ఎండాకాలంలో తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలంలో వాననీటిని నిల్వ చేయడంపై నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే వ్యవసాయ భూముల్లో కూడా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే సాగునీటి సమస్యలు తగ్గుతాయని తెలిపారు. మానేరు పర్యావరణ సమితి అధ్యక్షులు తోట లక్ష్మణరావు మాట్లాడుతూ ఎండిపోయిన బోర్లు, గుట్టలు, బీడు భూముల వద్ద ఇంకుడు గుంతలు, కాంటూర్ కందకాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో వాగులపై వాటర్‌షెడ్ ప్రాజెక్టులు చేపడితే భూగర్భ జలాలు పెరిగి నీటి కొరత తగ్గుతుందని పేర్కొన్నారు. సర్వోదయ సంఘం అధ్యక్షులు పెద్ది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కలుషిత నీటి వినియోగం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, జలవనరులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ కార్పొరేటర్ వంగల పవన్, మానేరు పర్యావరణ సమితి సభ్యులు గంజి స్వరాజ్యబాబు, సామ నారాయణ, కొమురవెల్లి వెంకటేశం, గంగిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నైతిక విలువలతోనే విద్యార్థుల భవిష్యత్తు బలపడుతుంది




కరీంనగర్, మార్చి 20: విద్యార్థులు విద్యలో విజయంతో పాటు నైతిక విలువలను కూడా అలవరుచుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో సుపథం సంస్థతో కలిసి నిర్వహించిన వ్యక్తిత్వ వికాస అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. తరగతి గదిలో నేర్చుకున్న విలువలను రోజువారీ జీవితంలో అమలు చేస్తే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు డా. శ్రీదేవి, డా. సంగీత రెడ్డి, డా. వనజా నరేందర్ రెడ్డి, యోగా గురువు లక్ష్మణ్, సంస్కృత అధ్యాపకురాలు అరుణ పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. భగవద్గీత శ్లోకాల పఠనం, సంగీతం, సంస్కృత శిక్షణ ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇవి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంతో పాటు భవిష్యత్తులో మంచి అవకాశాలను కల్పిస్తాయని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం 4వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు ప్రతి ఆదివారం మే 15 వరకు కొనసాగుతుందని, ఆసక్తిగల విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాగృతి బలోపేతం... కొత్త రాజకీయ శక్తి ఆవిర్భావం: గుంజపడుగు హరిప్రసాద్



కరీంనగర్, మార్చి 22: రాష్ట్రంలో ప్రతిపక్షాల బాధ్యతను కవితక్క నాయకత్వంలోని తెలంగాణ జాగృతి భుజాన వేసుకొని పేదల తరఫున పోరాడుతోందని జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. ఈరోజు కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మల్లపూరి రజిత సాయిలు, కరేంగుల నాగరాజు జాగృతి పార్టీలో చేరగా, వారికి హరిప్రసాద్ కండువా కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వెలుగుమట్ల ఘటనలో బాధితులకు న్యాయం జరగడం కవితక్క పోరాట ఫలితమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు గౌరవం ఇవ్వడంలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో మహిళలకు ప్రకటించిన రూ.2500 సాయం, తులం బంగారం, విద్యార్థులకు ఎలక్ట్రానిక్ వాహనం వంటి హామీలపై ఎలాంటి ప్రస్తావన లేదని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్త కేటాయింపులు లేవని, గత లెక్కలనే పునరావృతం చేశారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం పేదల పక్షాన కాకుండా ధనిక వర్గాలకు అనుకూలంగా పనిచేస్తోందని విమర్శించారు. తెలంగాణ మహిళల ఆత్మగౌరవం కోసం కవితక్క పోరాడుతోందని తెలిపారు. త్వరలోనే కవితక్క నాయకత్వంలో రాష్ట్రంలో కొత్త రాజకీయ శక్తి అవతరించనుందని, మహిళలు, యువతకు జాగృతిలో ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసీఆర్, హరీష్ రావు చిత్రపటాలకు పాలభిషేకం

**ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ బీఆర్ఎస్ ఘనతే**

**కేసీఆర్ సంకల్పం, హరీష్‌రావు కృషితోనే భారీ పరిశ్రమ**

**రైతుల సంక్షేమానికి అండగా నిలిచాం**

**ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీపై కాంగ్రెస్ పార్టీ క్రెడిట్ చోరీ**



హుస్నాబాద్,జనత న్యూస్: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నార్మేట గ్రామంలో దేశంలోనే అతిపెద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం హుస్నాబాద్ లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ చిత్రపటాలకు నాయకులు ఘనంగా పాలభిషేకం నిర్వహించారు. సుమారు 300 కోట్ల రూపాయల భారీ వ్యయంతో ఈ ఫ్యాక్టరీని తీసుకువచ్చి, ఈ ప్రాంత రైతుల ఆర్థికాభివృద్ధికి కేసీఆర్, హరీష్ రావు విశేష కృషి చేశారని ఈ సందర్భంగా వారు కొనియాడారు. హరీష్ రావు ప్రత్యేక పట్టుదలతో జిల్లాలో దాదాపు 12 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరిగేలా గ్రామ గ్రామాన అవగాహన సదస్సులు నిర్వహించి రైతులను ప్రోత్సహించారని నాయకులు గుర్తు చేశారు. ఆనాడు వారు పడిన కష్ట ఫలితమే నేడు నార్మేటలో ఈ భారీ పరిశ్రమ సాకారమైందని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని కూడా చెప్పుకోలేకపోతోందని వారు విమర్శించారు. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పై కాంగ్రెస్ పార్టీ క్రెడిట్ చోరీ చేసిందని దుయ్యబడ్డారు.ఎన్ని కుట్రలు చేసినా ప్రజల నుంచి బీఆర్ఎస్ పార్టీని వేరు చేయలేరని, రైతుల కోసం కేసీఆర్ చేసిన మేలు చిరస్మరణీయమని అన్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని, రైతులకు ఇచ్చిన ప్రతి వాగ్దానం నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, ఐలేని మల్లికార్జున రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ. అన్వర్ పాషా, మున్సిపల్ కౌన్సిలర్లు గాదపాక రవీందర్, గడిపే సంపత్, పార్టీ సీనియర్ నాయకులు బీలు నాయక్, సూరంపల్లి పరశురాములు, కన్నోజు రామకృష్ణ, కొంకట రవీందర్, ఇంద్రాల సారయ్య, యాస శ్రీనివాస్, కాశపోబోయిన శ్రీను, మేకల వికాస్ యాదవ్, సిదిరాల శ్రీనివాస్, జీవన్, నర్సింహారెడ్డి, గోపగోని అరవింద్ గౌడ్, బూర వెంకన్న గౌడ్, కనుకయ్య, గూగులోతు తిరుపతి నాయక్, పూదరి రవీందర్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వడ్లూరులో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన





జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని వడ్లూరు గ్రామంలో కరీంనగర్ సిద్ధి ఐ కేర్ హాస్పిటల్ వారు ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని, గ్రామ సర్పంచ్ పులి రమేష్ గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ మాజీ సర్పంచ్ బాణాల నరసింహారెడ్డి కుమార్తె బాణాల జ్యోతి గ్రామం మీద మమకారంతో ఇట్టి ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్యాక్స్ చైర్మన్ తన్నీరు శరత్ రావు, మాజీ సర్పంచ్ బాణాల నరసింహారెడ్డి, చిన్నాడి సుధాకర్ రెడ్డి, అన్నాడి అనంతరెడ్డి, కాసాని నరసయ్య, రా సూరి మల్లికార్జున్, కట్ట కొమురయ్య, కుక్కల రాములు, కాసాని శ్రీనివాస్, బోనాల శేఖర్ రెడ్డి, పులి శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సహకారంతో దాచారం గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

**దాచారం సర్పంచి బైర మానస సంతోష్.**



జనతన్యూస్ బెజ్జంకి : మానకొండూరు శాసనసభ్యులు రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ల సహకారంతో దాచారం గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని దాచారం గ్రామ సర్పంచ్ బైర మానస సంతోష్ ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 లక్షల నిధులతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే సారు కేటాయించారని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, దాచారం గ్రామ ఉపసర్పంచ్ దీటి బాల నర్సు, గ్రామ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

# నవాబుపేటలో సి.సి. రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



చిగురుమామిడి,జనత న్యూస్: మండల పరిధిలోని నవాబుపేట గ్రామ నాలుగో వార్డులో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా నూతన సి.సి. రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఏఎంసి చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, గ్రామ సర్పంచ్ గుళ్ళ రజిత రాజు ముఖ్య అతిథులుగా హాజరై శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసి చైర్మన్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి వీధిని అభివృద్ధి చేయడమే లక్ష్యమని, నాణ్యతతో కూడిన పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిధుల కేటాయింపులో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సేవా పురస్కారం అందుకున్న ఎలిగేటి శ్రీనివాస్



హైదరాబాద్, మార్చి 22: కరీంనగర్‌కు చెందిన ఎలిగేటి శ్రీనివాస్ సేవా పురస్కార అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో జరిగిన పద్మశాలి ఉగాది పురస్కారాల కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు, మాజీ మంత్రి బాబు మోహన్ ఆయనకు అవార్డును అందజేశారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ చేనేత ఐక్యవేదిక, రాష్ట్ర పద్మశాలి సంఘం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ సేవా రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందజేశారు. ఈ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని, తనకు సహకరించిన చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్‌కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకాకటి రాజ్‌కుమార్, ఇప్పనపల్లి రమేష్, మార్తా రమేష్, గంగా మల్లేశం, సిరిసిల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిల్మ్స్ వదిలేయాలనుకున్న శ్రీలీల

టాలివుడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల తన అందం, అభినయం, అదిరిపోయే డ్యాన్స్‌తో కుర్రకారు మనసు గెలుచుకున్నరు. హీరోయిన్ గా 'పెళ్ళి సందడి'తో ఎంట్రీ ఇచ్చి, అతి తక్కువ కాలంలోనే పవన్ కళ్యాణ్, మహేష్ బాబు వంటి స్టార్ హీరోల సరసన నటించే ఛాన్స్ కొట్టేసింది. అయితే వెండితెరపై ఎప్పుడూ నవ్వుతూ కనిపించే ఈ చిన్నది, కెరీర్ మొదట్లో తీవ్రమైన మానసిక వేదనను అనుభవించిందట. ఏకంగా సినిమాలే వదిలేయాలని నిర్ణయించుకున్న ఆ చేదు జ్ఞాపకాలను ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పంచుకుంది. ఆ విశేషాలు మీకోసం.. శ్రీలీల కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న అతిపెద్ద సమస్య సోషల్ మీడియా ట్రోలింగ్. మనం చూస్తుంటాం కదా, ఎవరో ఏదో అన్నారని మనం ఎంత బాధపడతామో, సెలబ్రిటీల పరిస్థితి అంతకంటే దారుణంగా ఉంటుంది. ఇక శ్రీలీల చాలా సున్నిత మనస్కురాలు కావడం వల్ల, నెటిజన్లు చేసే నెగిటివ్ కామెంట్స్ తనను బాగా గాయపరిచాయట. "మొదట్లో ఆ ట్రోల్స్ చూసి తట్టుకోలేకపోయేదాన్ని, ఒంటరిగా కూర్చుని చాలా ఏడ్చేదాన్ని" అంటూ తన మనసులోని బాధను బయటపెట్టింది. చిన్న వయసులోనే అంత నెగిటివిటీని చూడటం ఆమెకు పెద్ద సవాల్‌గా మారింది.

ఇక ట్రోలింగ్ మరీ ఎక్కువ కావడంతో ఒకానొక దశలో శ్రీలీల పూర్తిగా నిరాశకు లోనైందట. ఇక గ్లామర్ ప్రపంచం తనకు వద్దని, ప్రశాంతంగా చదువుకుంటానని నిర్ణయించుకుంది. వెంటనే తన తల్లి దగ్గరకు వెళ్లి, "అమ్మా, నాకు ఈ సినిమాలు వద్దు.. నేను మళ్ళీ కాలేజీకి వెళ్లి నా చదువు కంటిన్యూ చేస్తాను" అని చెప్పిందట. ఎంత ఒత్తిడి ఉంటే ఒక హీరోయిన్ అంతటి నిర్ణయం తీసుకుంటుందో అర్థం చేసుకోవచ్చు. కానీ ఆమె తల్లి ఇచ్చిన ధైర్యం, సపోర్ట్ వల్లే శ్రీలీల మళ్ళీ వెనక్కి తగ్గకుండా పోరాడగలిగింది. ప్రస్తుతం శ్రీలీల తన ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చుకుంది. ఒకప్పుడు దేనికైతే భయపడిందో, ఇప్పుడు దాన్నే ధైర్యంగా ఎదుర్కోవడం నేర్చుకుంది. ఇప్పుడు జనాలు కూడా చాలా మారుతున్నారని, ఎవరైనా పనిగట్టుకుని టార్గెట్ చేస్తే సపోర్ట్ చేసేవారు కూడా ఉన్నారని ఆమె అంటోంది. "నెగిటివ్ కామెంట్స్‌ని ఎలా డీల్ చేయాలో ఇప్పుడు నాకు అర్థమైంది" అంటూ తనలో వచ్చిన మార్పును గర్వంగా చెప్పుకొచ్చింది. ఇక ఈ పరిణతి వల్లే ఆమె ఇప్పుడు పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' వంటి క్రేజీ ప్రాజెక్టుల్లో భాగమైంది.



## చెప్పిందొకటి, చూపించింది మరొకటి!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన పుష్ప2 సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసిందనే విషయం తెలిసిందే. కలెక్షన్స్, రికార్డుల పరంగా ఈ సినిమా కొత్త బెంచ్‌మార్క్‌లను సెట్ చేసినప్పటికీ, ఆ సినిమాలో నటించిన ఒక నటి అనుభవం మాత్రం మరో కోణాన్ని బయటపెడుతోంది. గ్లామర్, గ్రాండ్‌నెస్ వెనుక దాగి ఉన్న ఎడిటింగ్ రియాలిటీ పై ఈ సంఘటన చర్చకు దారి తీసింది. ఈ నేపథ్యంలో చర్చలోకి వచ్చిన పేరు దివి. బిగ్‌బాస్ ద్వారా మంచి గుర్తింపు పొందిన ఈ బ్యూటీ, చిన్న పాత్రలతో కెరీర్ ప్రారంభించి ముందుకు సాగింది. మహర్షి సినిమాలో హీరోయిన్ ఫ్రెండ్ క్యారెక్టర్ లో కనిపించిన దివి, తర్వాత అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న క్రమంలో ఆమెకు పుష్ప 2లో ఛాన్స్ రావడం తన కెరీర్ కు టర్నింగ్ పాయింట్ అవుతుందని భావించింది. పుష్ప2 సినిమాలో దివి రిపోర్టర్ గా కనిపించింది. తనకు కథ చెప్పేటప్పుడు ఆమె పాత్ర కథలో కీలకంగా ఉంటుందని చెప్పారని, టీజర్‌లో కూడా ఆమె కనిపించడంతో, సినిమాలో తన స్క్రీన్ ప్రెజెన్స్ బలంగా ఉంటుందని నమ్మానని దివి చెప్పింది. కానీ ఫైనల్ అవుట్‌పుట్ మాత్రం పూర్తిగా భిన్నంగా మారింది. తాను ఈ సినిమా కోసం దాదాపు 20 రోజుల షూటింగ్, మరో 10 రోజుల డబ్బింగ్ చేసినప్పటికీ, ఫైనల్ కట్‌లో ఆమె పాత్రను చాలా వరకు ఎడిటింగ్ చేశారని, థియేటర్‌లో సినిమా చూసినప్పుడు, తన సీన్స్ చాలా తక్కువగా ఉండటంతో షాక్‌కు గురయ్యానని ఆమె వెల్లడించింది. టీజర్‌లో చూపించిన కొన్ని సీన్స్ కూడా సినిమాలో లేకపోవడం ఆమెకు మరింత నిరాశ కలిగించిందని తెలిపింది. ఈ సంఘటనతో మరోసారి సినిమా ఎడిటింగ్ ప్రక్రియపై దృష్టి పడుతోంది. పెద్ద సినిమాల్లో రన్‌టైమ్, పేసింగ్ వంటి అంశాల దృష్ట్యా ఎన్నో సీన్స్ లాస్ట్ మినిట్ లో తొలగించడం సాధారణమే. అయితే ఈ ప్రక్రియలో కొత్తగా ఎదుగుతున్న ఆర్టిస్టులు తమ పాత్రలపై పెట్టుకున్న ఆశలు ఛిన్నాభిన్నం కావడం కూడా తరచూ కనిపించే వాస్తవం. దివి తన స్నేహితులను కూడా థియేటర్‌కు తీసుకెళ్లిన సందర్భంలో, తన పాత్ర కేవలం కొన్ని సీన్స్‌కే పరిమితం కావడం తనను నిరాశకు గురి చేసింది, అయినప్పటికీ ఇలాంటి విషయాలు ఇండస్ట్రీలో సాధారణమే... ముందుకు సాగాల్సిందేనంటూ ఆమె చెప్పిన మాటలు, ఒక ఆర్టిస్ట్ ప్రొఫెషనల్ మైండ్‌సెట్‌ను ప్రతిబింబిస్తున్నాయి. దీన్ని బట్టి చూసుకుంటే పుష్ప2 లాంటి భారీ విజయాల వెనుక కూడా వ్యక్తిగత స్థాయిలో కొన్ని అసంతృప్తులు దాగి ఉంటాయని ఈ సంఘటన స్పష్టంగా చూపిస్తోంది.





## రామ్ చరణ్ 'పెద్ది'లో మృణాల్ ఠాకూర్ ఐటమ్ సాంగ్..?

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'పెద్ది' సినిమాపై ఓ ఆసక్తికర ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలోని ఓ ప్రత్యేక గీతంలో ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్ కనిపించనున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ స్పెషల్ సాంగ్‌లో మృణాల్‌తో పాటు మరో ఇద్దరు హీరోయిన్లు కూడా ఉంటారని కొందరు అంటుండగా, కేవలం ఆమె మాత్రమే ఉంటుందని మరికొన్ని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ వార్తలపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం 'పెద్ది' చివరి దశ షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులతో శరవేగంగా ముందుకు సాగుతోంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ వంటి సీనియర్ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆర్ రత్నవేలు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



## పింక్ లెహంగాలో తమన్నా

టాలీవుడ్ మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా తనదైన అందం.. అభినయంతో రెండు దశాబ్ధాల కాలంగా ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. కేవలం వెండితెరపైనే కాకుండా, ఫ్యాషన్ ప్రపంచంలోనూ తమన్నా తనదైన ముద్ర వేస్తోంది. తాజాగా లక్మే ఫ్యాషన్ వీక్ వేదికగా తమన్నా ధరించిన పింక్ డిజైనర్ దుస్తులు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. ఈ ఫోటో స్టోరీలో తమన్నా మెరుపులు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మిల్కీ గ్లామర్ చూస్తుంటే ఇప్పటికీ కాలేజీ అమ్మాయిలాగే ఉందంటూ అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ భూమిక శర్మ రూపొందించిన ఆఫ్టర్ గ్లో కలెక్షన్‌లో భాగంగా తమన్నా ఈ పింక్ కలర్ మోడ్రన్ లెహంగాలో మెరిశారు. ఈ దుస్తుల గురించి తమన్నా స్పందిస్తూ ఈ డ్రెస్ ధరించడం చాలా సౌకర్యవంతంగా ఉందని తెలిపారు. ఇది ప్లేఫుల్ గా, మోడ్రన్ గా ఉంటూనే ఒక రకమైన ప్రశాంతతను, మెరుపును ఇస్తోందని తన ఇన్‌స్టాలో పేర్కొన్నారు. ఫ్యాషన్ ప్రపంచంలో ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కోరుకునే వారికి ఈ లుక్ ఒక స్ఫూర్తిగా నిలుస్తోంది. ఈ పింక్ లెహంగాపై చేసిన సునిశితమైన ఎంబ్రాయిడరీ వర్క్.. జతగా ఎంపిక చేసుకున్న మోడ్రన్ బ్లౌజ్ తమన్నా అందాన్ని రెట్టింపు చేశాయి. ఆధునికత, సంప్రదాయం కలగలిసిన ఈ లెహంగాలో ఎంతో హుందాగా కనిపిస్తున్నారు. ఈ ఫోటోలను చూసిన అభిమానులతో పాటు తోటి నటి కాజల్ అగర్వాల్ సైతం ఈ లుక్‌కు ఫిదా అయిపోయారు. ప్రస్తుతం ఈ ఫోటోలు ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com